## రంజాన్ ప్రార్థన సందర్భంగా ఆంక్షలు

హైదరాబాద్,ఏప్రిల్10: ఈద్ ఉల్ ఫితర్ రంజాన్ పండగ సందర్భంగా మిరాలంమండి ఈద్గా, మాసబ్‌ట్యాంక్ హాకీ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రంజాన్ పండుగ ప్రత్యేక నమాజు దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని తెలిపారు. పురానాపూల్, కామాటిపురా, కిషన్‌బాగ్ వైపు నుంచి ఈద్గా వైపునకు వచ్చే వాహనాలను బహదూర్‌పురా క్రాస్‌రోడ్స్ దాటి అనుమతిం చరు. ప్రార్థనలకు వచ్చే వారి వాహనాలను జూపార్క్ ఓపెన్ ప్లేస్‌లో పార్కింగ్ చేసుకోవాలి. శివరాంపల్లి, దానమ్మహట్స్ వైపునకు వచ్చే వాహనాలను దానమ్మహట్స్ క్రాస్‌రోడ్స్ వైపు నుంచి ముందుకు వెళ్లనివ్వరు. వీరికి మోడరన్ సా మిల్, మిరాలం ఫిల్టర్ బెడ్, సూఫీ కార్స్ వద్ద పార్కింగ్ స్థలం కేటాయించారు. కాలాపత్తర్ వైపు నుంచి వచ్చే వాహనాలను మోచీ కాలనీ, బహదూర్‌పురా, శంషీర్‌గంజ్, నవాబ్ సాహెబ్‌కుంట వైపునకు పంపుతారు. ప్రార్థనలకు వచ్చే వారికి భయ్యా పార్కింగ్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :48 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: గురువారం 11-04-2024 పేజీలు:4 వెల: 2.00


## 26కు విచారణ వాయిదా,కండీషన్స్ అప్లై..!





న్యూఢిల్లీ, ఢిల్లీ మద్యం కేసు అనేక మలుపులు తిరుగుతోంది. ఈ కేసు నుంచి బయటపడేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేయని ప్రయత్నాలు లేవు. ప్రతీవారం ఏదో ఒక పిటిషన్ న్యాయస్థానంలో దాఖలు చేస్తున్నారు. తాజాగా తనను ప్రశ్నించేందుకు సీబీఐకి అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటీషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు బుధవారం విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు, తదుపరి విచారణను ఈనెల 26కి వాయిదా వేసింది.కవిత దాఖలు చేసిన పిటీషన్‌పై సమాధానం ఇవ్వాలని సీబీఐకి నోటీసులు జారీ చేసింది ప్రత్యేక న్యాయస్థానం. కవితను ప్రశ్నించడంపై రిప్లై దాఖలు చేయడం లేదని సీబీఐ తెలిపింది. సీబీఐ కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కవిత తరపు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. మళ్లీ ప్రశ్నించాల్సి వస్తే ముందే తమకు సమాచారం ఇవ్వాలని సీబీఐని కోరినట్టు చెప్పారు. ఇదే విషయాన్ని ఆమె తరపు న్యాయవాదులకు సూచించారు న్యాయమూర్తి.సీబీఐ కౌంటర్ దాఖలు చేయకపోవడంపై వాదనలు వినిపిస్తామన్నారు కవిత తరపు న్యాయవాదులు. దీంతో తదుపరి విచారణను ఈనెల 26కు వాయిదా వేసింది. తీహార్ జైలులో ఉన్న కవితను విచారించేం దుకు శుక్రవారం సీబీఐ అనుమతి తీసుకుంది. షరతులతో కూడి పర్మీషన్ న్యాయస్థానం మంజూరు చేసింది. ఆమెను ప్రశ్నించే దుకు ఒక రోజు ముందు జైలు అధికారులకు సీబీఐ సమాచారం ఇవ్వాలని ఆదేశించింది.విచారణ సమయంలో మహిళా కానిస్టేబుళ్లు ఉండాలని షరతు పెట్టింది. ఆమెని ప్రశ్నించే సమయంలో ల్యాప్ టాప్, ఇతర స్టేషనరీ తీసుకొచ్చేం దుకు సీబీఐకి ఓకే చెప్పింది. అయితే సీబీఐకి అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ శనివారం పిటిషన్ దాఖలు చేశారు కవిత. ఇదిలావుండగా తనను జైలులోనే సీబీఐ ప్రశ్నించిందని మంగళవారం కోర్టుకు హాజరైనప్పుడు కవిత వెల్లడించారు.

## నాటి నుంచి అక్కడ గులాబీదే హవా..

సంగారెడ్డి : మెదక్ పార్లమెంట్ స్థానం(మెదక్ పార్లమెంట్ స్థానం) బీఆర్ఎపార్టీ అడ్డా. మెదక్‌లో వెంకట్రామి రెడ్డి ఘన విజయం సాధించబోతున్నారు. 2004 నుంచి మెదక్‌లో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. బుధవారం పటాన్ చెరువు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని శ్రీ సిద్ది గణపతి దేవాలయం (గణేష్ గడ్డ) ఆవరణలో బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ ఎన్నికల ప్రచార రథాలను కలిగి ఉంది.ఈ సందర్భంగా గులాబీ హరీశ్ రావు మాట్లాడుతూ.. జెండా పుట్టినప్పటి నుంచి మెదక్ పార్లమెంట్ కోసం బీఆర్ఎస్ గెలుస్తున్న గుర్తు చేశారు. మళ్లీ మెదక్ పార్లమెంట్‌లో తిరుగులేని మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. ఓట్ల కోసం ప్రజలను నమ్మించి మోసం చేసిందని. రూ.4 వేల పింఛన్లు, రైతుబ ంధు, మహిళలకు రూ.2,500 ఇలా ఇచ్చిన హామీలన్నీ మర్చిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులను పట్టించుకోలేదు..కాంగ్రెస్ పార్టీ వాళ్లు గారడి మాటలు చెప్పారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ పై తిట్ల పురాణం మొదలు పెట్టాడు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసింది..రేవంత్ రెడ్డి తిట్ల కోసమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫేక్ వార్తలు, లీకులతో దుష్ప్రచారం. రైతులను పట్టించుకో లేదని చెప్పారు. వెంకట్రామిరెడ్డి (వెంకట్రామి రెడ్డి) పక్కా లోకల్.. తెల్లాపూర్‌లోనే నివాసం ఉంటారని పేర్కొన్నారు.వెంకట్రామిరెడ్డి అధికారిగా మెదక్ జిల్లా ప్రజలకు



సేవ చేశారు. మంచి మనిషి, పరిపాలన అనుభవం ఉండి ప్రజలకు అందు బాటులో ఉండే వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని. దుబ్బాక ప్రజలు బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును చిత్తు చిత్తుగా ఓడించారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు ఏమి చేసింది.భవిషత్తు అంతా బీఆర్ఎస్ పార్టీదేనని స్పష్టం చేశారు.మళ్లీ అధికారంలోకి వచ్చేదిబీఆర్ఎస్ పార్టీయేనని,మన ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేసే వెంకట్రామి రెడ్డిని గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మెదక్ లోక్ సభ అభ్యర్థి వెంకటరామిరెడ్డి ఉన్నారు.

## సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు...

న్యూఢిల్లీ : జెఎన్‌యు మాజీ విద్యార్థి ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు కొనసాగుతున్నాయి. ఉమర్ ఖలీద్ సోషల్ మీడియాలో తప్పుడు కథనాలను పోస్ట్ చేసినట్లు ఢిల్లీ పోలీసులు కోర్టుకు తెలిపారు. 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో అరెస్టయిన ఖలీద్ బెయిల్ పిటిషన్‌పై మంగళవారం అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బాజ్‌పారు ఎదుట ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. ఈ వాదనపై ఖలీద్ తరపు న్యాయవాదులు నేడు వాదనలు వినిపించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఖలీద్‌కు పలువురు నటులు, కార్యకర్తలు, రాజకీయ నేతలతో సంబంధాలు ఉన్నాయని ఆయన మెబైల్ ఫోన్‌లోని సమాచారాన్ని వెల్లడించారు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూర్ అమిత్ ప్రసాద్. ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా కొన్ని న్యూస్ పోర్టల్స్ నుండి వారికి లింక్లు పంపారని అన్నారు. అల్లర్లపై కథనాన్ని పోస్ట్ చేసి, వాటిని సోషల్ మీడియా ఖాతాలలో పోస్ట్ చేయాలన్న అభ్యర్థనలతో ఈ లింక్‌లు వారికి పంపినట్లు తెలిపారు. కుట్రలో భాగంగానే ఖలీద్ ఈ కథనాలను వారికి పోస్ట్ చేసారు, వారితో చాట్ చేసిన న్యాయవాది గురించి. ఖలీద్ తండ్రి న్యూస్ పోర్టల్‌కి ఇచ్చిన వీడియోను కూడా కోర్టులో అమిత్ ఇంటర్వ్యూ ప్రసాద్ ప్లే చేశారు.సుప్రీంకోర్టుపై తమకు విశ్వాసం లేదని ఖలీద్ తండ్రి ఆ ఇంటర్వ్యూలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. వారికి సుప్రీంకోర్టుపై విశ్వాసం లేదని, అందుకే



ట్రయల్ కోర్టుకు వచ్చినట్లు తనకు అనుకూలంగా కథనాన్ని సృష్టించారని పేర్కొన్నారు. విచారణ అనంతరం నిరసనలను షెడ్యూల్ చేయమని ఖలీద్ వాట్సప్ గ్రూప్ సభ్యులను కోరినట్లు.2020 అల్లర్ల కేసులో అరెస్టయిన ఖలీద్, సహా అనేక ప్రధాన సూత్రధారులంటూ యుఎపిఎ సహా ఐపిసిలోని పలు సెక్షన్ల కింద వారిపై కేసులు నమోదు చేయబడ్డాయి. వివాదాస్పద సిఎకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసనలు హింసాత్మకంగా మారడంతో సుమారు 53 మంది మరణించారు, 700 మందికి పైగా గాయపడ్డారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి కొమ్ము కాస్తోంది



నిజామాబాద్ ఏప్రిల్ 10: కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి కొమ్ము కాస్తోందనీ ఎంపీ ధర్మ పురి అరవింద్ ధ్వజమె త్తారు. మనది మోదీ కుటుంబం లో భాగంగా బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్మూర్ పట్టణంలో నిర్వహించిన చాయిపే చర్చ కార్యక్రమానికిపార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఆర్మూర్ లోని జీవన్ మాల్ విషయంలో అధికారం వచ్చిన వెంటనే నోటీ సులు ఇచ్చి కాంగ్రెస్ హడావుడి చేసింద న్నారు.మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి.. కాంగ్రెస్ నాయ కులు, అధికారులకు కొంచెం చెల్లించ గానే మళ్ళీ సపుడు లేదన్నారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ కు రూ. 50 కోట్లు కట్టాలి, శాఖకు కు ఒక కిస్తి మాత్రమే కట్టాడు, ఇంకా ఆర్టీసీ, మున్సిపాలిటీ కి కట్టాలనీ తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ ప్రత్యేక కృషి చేస్తున్నారని అన్నారు.తెలంగాణలో వ్యవసా య ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు నిజామాబాద్ సరై న ప్రదేశమని అన్నారు. మోది రాక ముందు వరి మద్దతు ధర రూ.1300 ఉంటే.. మోది వచ్చాక రూ.2 వేలు దాటిందనీ గుర్తు చేశారు. ఫర్టిలైజర్, యూరియా లు వంటి వాటి మీద రైతులకు రూ. 18వేలు రైతులకు మోది ఇస్తున్నాడనీ తెలిపారు.ప్రతి ఎకరాకు రూ.6వేలు కిసాన్ సమ్మాన్ నిధి కింద అందిస్తున్నారన్నారు. నిజామాబాద్ జిల్లాకు పసుపు, జగిత్యాల జిల్లా కు మామిడి ని వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద ఎంపిక చేశామని తెలిపారు.ఈ రెండు పంటల ఎగుమతులపై కేంద్రం చర్యలు తీసుకుంద న్నారు.అందులో భాగంగానే పసుపు ను ఇతర దేశాలకు ఎగుమతి చేశాం.. మంచి ధర లభించిందనీ అన్నారు. పసుపు బోర్డు వస్తే.. విత్తనాలు, భూసా ర పరీక్షలు మొదలు.. అన్ని అంశాలపై దృష్టి ఉంటుం దన్నారు. పరిమితిలో ఎరువు లు వాడితే పసుపు ఎగుమ తులకు డిమాండ్ ఉంటుందనీ రైతులకు సూచించారు. గోదా ములు, పసుపు శుద్ధి కర్మా గారాలు వస్తాయన్నారు. రైతు లు, వినియోగదారులను కలిపే వ్యవస్థ ఏర్పాటు అవుతుంద న్నారు.రైతుల వద్దకే కొను గోలుదారు వచ్చి పంట కొనేలా వ్యవస్థ ఏర్పాటు అవుతుందనీ ఎంపీ తెలిపారు.నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కేవలం ఒకే ఒక్క రైల్వే బ్రిడ్జి ఉండేది.. నేను వచ్చాక ఏడు తీసుకొచ్చాననీ ఈ సందర్భంగా తెలిపారు. అవి నీతి కారణంగానే చక్కెర పరిశ్ర మలు తెరుచుకోవడం లేదనీ మండిపడ్డారు. నిజామాబాద్ మార్కె ట్ యార్డు తెలంగాణా లోనే పెద్దదన్నారు.పసుపు లావా దేవీల మీదనే యార్డు కు రూ 10-12 కోట్లు ఆదాయం వస్తుంది%ూ% ఏటా 20 కోట్ల ఆదా యం ఉంటుందన్నారు.కానీ ఆ నిధులు నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఖర్చు చేస్తలేరనీ తెలిపారు.కొన్నేళ్లుగా ఆ నిధులు మొత్తం సిరిసిల్ల, సిద్దిపేట కు వెళ్లిపోయాయని ఆరోపించారు.నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఒక్క సౌలత్ ఏర్పాటు చెయ లేదన్నారు.సీఏఏ 2019 లో తెస్తే%ూ% కాంగ్రెస్ లొల్లి పెట్టిందనీ గుర్తు చేశారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ముస్లిం లకు సైతం పౌర సత్వం ఇవ్వాలని ఆందోళన చేశాడన్నారు. ఇప్పుడు సీఏఏ అమలు చేస్తుంటే ఎన్నికలు ఉన్నాయని హిందువుల ఓట్ల కోసం జీవన్ రెడ్డి మౌనంగా ఉన్నాడన్నారు. ముస్లిం లకు పౌరసత్వం ఇస్తే ప్రత్యేకంగా ముస్లిం దేశాలు ఎందుకు మరి అని ప్రశ్నించారు.

## ఆ రోజు నుంచి టీఆర్ఎస్ గా బీఆర్ఎస్ ?

హైదరాబాద్,భారత రాష్ట్ర సమితి షార్ట్ కట్ లో బీఆర్ఎస్ అచ్చి రాలేదు. 2022 అక్టోబర్ నెల విజయదశమి వేళ పేరు మార్చారు. ఇక మీదట మనది జాతీయ పార్టీ అన్నారు. ఇంకేముంది కేసీఆర్ జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతారు అని కూడా ఆశలు పెట్టుకున్నారు. 2024 ఎన్నికల నాటికి తెలంగాణలో మూడవసారి గెలిచి జాతీయ ముఖ్య పాత్ర పోషించడానికి బీఆర్ ఎస్ గా పేరు మార్చారు.అదేదో సామెత మాదిరిగా కొత్త దాని కోసం చూస్తే ఉన్నది కూడా పోయింది అన్నట్లు అయింది. బీఆర్ఎస్ ని పేరు పెట్టిన క్షణం నుంచే కష్టాలు మొదలయ్యాయి. లిక్కర్ స్కాం అపుడే మొదలైంది. ఆ తరువాత చూస్తే పార్టీ పరంగా కష్టాలు వేధించాయి. ఇక 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా దూరం అయింది.దాంతో బీఆర్ఎస్ పేరు తమ కొంప ముంచింది అని పార్టీలు అంతా ముక్త కంఠంతో అంటున్న మాట. సమయం లేదు ఇక పేరు మార్చాల్సిందే. తెలంగాణ గొంతుకగా ఆత్మగా పార్టీ ఉండాలి అంటే కచ్చితంగా తెలంగాణ రాష్ట్ర సమితిగా ఉండాల్సిందే అంటున్నారు.టీఆర్ఎస్ 2001లో మొదలైంది. 2022 దాకా చూస్తే ఎదుగుదల తప్ప ఇబ్బందులు లేకుండా కొనసాగింది. అలా పార్టీకి ఊతమిచ్చేలా టీఆర్ఎస్ పేరు బలం కలసి వచ్చిందని అంటున్నారు. దాంతో ఈసారి జరిగే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ వద్దు అని టీఆర్ఎస్ గానే వెళ్లాలని కూడా పార్టీ అధినేత తొందరపడుతున్నారు.దాంతో ఈ నెల 27న తెలంగాణ రాష్ట్ర సమితి 24వ వార్షికోత్సవ వేడుకలు జరుగుతాయి. ఆ సమావేశంలోనే బీఆర్ఎస్ పేరు కాస్త టీఆర్ఎస్ గా మారుతుందని అంటున్నారు. అది మంచి ముహూర్తం అని పార్టీ వేదిక మీదనే సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకుంటే మే లో ఎన్నికలలో టీఆర్ఎస్ గా మార్పు వస్తుందని అదృష్టం కలసి వచ్చి అనుకున్న స్థాయిలో ఎంపీ సీట్లు సాధించే అవకాశం ఉంటుంది.మొత్తం మీద బీఆర్ఎస్ అంటూ హడావుడి చేసి పట్టుమని రెండేళ్ళు కాకుండానే తిరిగి టీఆర్ఎస్ గా పూర్వ నామధేయంలోకి ఆ పార్టీ వెళ్లిపోతోంది. చిత్రమేంటి అంటే 2024 ఎన్నికల్లో బీఆర్ఎస్ గా ఒక జాతీయ పార్టీగా మారి ఏపీ ఎన్నికల్లో పోటీ చేద్దామని కేసీఆర్ అనుకున్నాను. ఆయన మహారాష్ట్ర వెళ్లారు. బీహార్ వెళ్లారు, ఇతర రాష్ట్రాలు తిరిగారు.సాటి తెలుగు రాష్ట్రం అయిన ఏపీకి ఆర్భాటంగా రావాలనుకున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో పాలు పంచుకోవాలని చూసారు. అమరావతిలో కానీ విశాఖలో కానీ భారీ మీటింగ్ కేసీఆర్ పెట్టాలనుకున్నారు. ఏపీలో బీఆర్ఎస్ శాఖను గుర్తించారు. బలమైన సామాజిక వర్గాలను ఆకర్షించాలని చూశారు. అన్నీ అనుకూలించినట్లు అయితే తెలంగాణాలో బీఆర్ఎస్ గెలిచి ఉంటే ఏపీలో కూడా కేసీయార్ హడావుడి ఈసారి ఎన్నికల్లో వేరే లెవెల్ లో ఉండేది. ఇపుడు బీఆర్ఎస్ ప్యాకప్ చెప్పి టీఆర్ఎస్ గా రాబోతున్న నేపధ్యంలో ఇక అవసరం కానీ ఏపీలో కేసీఆర్ పార్టీ పర్యటనలకు కానీ అసలు అవకాశం కానీ ఉండబోదని అంటున్నారు.

## జిందాల్ ప్రవేశంతో నష్టాల కొలిమి

విశాఖ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అష్టదిగ్బంధంలోకి నెట్టేసే కుట్రలు కొనసాగుతున్నాయి. ప్లాంట్‌లోని విభాగాలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూ వస్తున్న కేంద్రం తాజాగా ఐరన్, కోక్‌ల విషయంలో జిందాల్‌పై ఆధారపడేలా చేసి మరింత నష్టాల కూపంలోకి ప్లాంట్‌ను తోసేసే కుట్రలకు తెగబడింది. 2021 జనవరి 20న బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం వ్యూహాత్మక అమ్మకం చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పటి నుంచి విశాఖలోనూ, రాష్ట్రంలోనూ ఉద్యమం కొనసాగుతోంది. 2022 జనవరిలో బ్లాస్ట్ ఫర్నేస్-3ను మూసేసి 'మీ డబ్బులు మీరే తెచ్చుకుని ప్లాంట్‌ను బతికించుకోండి' అన్న... మోడీ సర్కారుకు స్టీల్ యాజమాన్యం సై అంటూ జిందాల్‌కు స్వాగతం పలికింది. 2023లో జిందాల్‌ను ప్లాంట్‌లోకి మోడీ తెచ్చారు.

ఆ తర్వాత ఉత్పత్తి పూర్తిగా కుంటుపడింది. రాయబరేలిలోని రూ.2 వేల కోట్ల ఫోర్జ్ వీల్ ఫ్యాక్టరీ (స్టీల్‌ప్లాంట్‌కు చెందినది)ని సైతం రూ.19 కోట్లకు అమ్మేశారు. ఆ డబ్బులు ఇంతవరకూ ప్లాంట్‌కు రాలేదు. ఎప్పుడొస్తాయో తెలియదు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఒక్క రూపాయి కూడా కేంద్రం ఇవ్వకుండా, అప్పు కూడా బ్యాంకుల నుంచి పుట్టనివ్వకుండా ప్రభుత్వ ధనమంతా ప్లాంట్‌కే ధారపోసినట్లు బిజెపి ప్రచారం చేస్తోంది. ప్రజలను తప్పుదోవ పట్టించి కార్మిక పోరాటాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు కొనసాగుతున్నాయి. వ్యాధి రెండేళ్లలో కేవలం రూ.800 కోట్లు మాత్రమే స్టీల్ అమ్మకాలు జరిగాయి. ఆనాడెప్పుడూ కార్మిక, ఉద్యోగుల జీతాలకు ఇబ్బంది రాలేదు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.2,500 కోట్లు స్టీల్ అమ్మకాలు జరిగిన జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, అధికారులు జీతాలకు సైతం నోచుకోని తాజా పరిస్థితులపై అందరూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

'కోల్' బదులు కోక్ కొంటూ...

ఇతర దేశాల నుంచి కోల్ దిగుమతి చేసుకుని కోక్ తయారు చేయడం ప్లాంట్‌లో ఆనవాయితీగా ఉండేది. మోడీ ప్రభుత్వం నిర్ణయంతో నేరుగా జిందాల్ దగ్గర కోక్ కొనుక్కోవడం మొదలైంది. ప్లాంట్‌కు కోకోవెన్ బ్యాటరీలు ఐదు ఉన్నా వీటిల్లో ఉత్పత్తి తగ్గించుకుని జిందాల్ నుంచి నేరుగా కోక్ కొనుగోలు చేయాలని



నిర్ణయించడం వల్ల టన్నుకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు అదనపు భారం ప్లాంట్‌పై పడుతోంది. వాస్తవానికి 420 కుషింగ్స్ రోజుకు తయారు చేసుకునే కెపాసిటీ స్టీల్‌ప్లాంట్‌కు ఉంది. ఇప్పుడు ఇక్కడ ఉత్పత్తిని 60 శాతంపైగా తగ్గించుకుని జిందాల్‌పై పూర్తిగా ఆధారపడేలా కేంద్రం చేసిన నిర్ణయంతో ప్లాంట్ ఆర్థిక పరిస్థితి దినదినగండంగా మారింది. ఎన్‌ఎండిసి నుంచి ఐరన్ ఓర్‌ను ప్లాంట్ తీసుకునేది. ఎన్‌ఎండిసితో ప్లాంట్‌కు కాంట్రాక్టు ఉంది. రోజుకు ఎనిమిది ర్యాకులు కావాలి. జిందాల్ ఎంట్రీ తర్వాత సరాసరి ఐదు ర్యాకులు కూడా రావడం లేదు. కేంద్రం ఇవ్వనీవ్వడం లేదు. ఒక ర్యాకులో నాలుగు వేల టన్నుల ఐరన్ ఓర్ ఉంటుంది. ఐరన్ ఓర్ ప్లాంట్‌కి లేదు కాబట్టి పెల్లెట్స్ వాడాలన్న కేంద్రం దాని విక్రయ యాజమాన్యం పాటిస్తోంది. ఇది కూడా జిందాల్ నుంచే కొనుగోలు చేస్తున్నారు. ఐరన్ ఓర్ ధర రూ.5 వేలు. అయితే, రూ.12 వేలకు స్టీల్‌ప్లాంట్ పెల్లెట్స్ కొంటోంది. ఇది మరో భారంగా ప్లాంట్‌కు పరిణమించింది. అంటే, కోల్ బదులు కోక్... ఐరన్ ఓర్ బదులు పెల్లెట్స్ కొంటూ భారం పెంచారు. ఈ వస్తువుల ద్వారా జిందాల్‌కు కోట్ల రూపాయలను కేంద్రం, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కలిసి దోచిపెడుతున్నాయి. బ్లాస్ట్ ఫర్నేస్-3లోకి జిందాల్ ఎంట్రీ ఇవ్వడానికిగానూ కుదుర్చుకున్న కాంట్రాక్టు ప్రకారం మరల 90 వేల టన్నులను ప్లాంట్ ఇవ్వడంతో మరింత అగాథంలోకి ఉక్కు కర్మాగారం నెట్టబడుతోంది.

## మంత్రి సీతక్కకు సత్కారం..

హైదరాబాద్,రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క మణుగూరులో పర్యటిస్తున్నారు. డివి రాయల్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మంత్రి పాల్గొన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుల్లూరి బ్రహ్మయ్య లు పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంత్రి సీతక్కను శాలువాతో సత్కరించారు. మహబూబాబాద్ పార్లమెంట్, పినపాక నియోజకవర్గ బూర్గంపాడు మండలం పర్యటనలో భాగంగా మంత్రి సీతక్కతో కలిసి పలు కార్యక్రమాల్లో మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ పాల్గొన్నారు. వారితో పాటు భద్రాచలం మాజీ గ్రంథాలయ చైర్మన్ భోగల శ్రీనివాసరెడ్డి,



పినపాక నియోజకవర్గం నాయకులు బట్ట విజయ గాంధీ, యూత్ కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

## సంపాదకీయం

**గురువారం 11-04-2024**

# కాలం తెచ్చిన కరువు కానే కాదు

తెలంగాణకు మళ్లీ కరువొచ్చింది. రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ వర్షాలకు కరువొచ్చింది. చెరువులకు కరువొచ్చింది. భూగర్భానికి కరువొచ్చింది. పంటచేలకు కరువొచ్చింది. రైతుబంధుకు కరువొచ్చింది. కల్లాల మీద పంటకు కరువొచ్చింది. నీళ్లు రాక.. పడావు పడ్డ భూములతో తెలంగాణ గొంతు తడారిపోతోంది. తెలంగాణ వాకిట్లో కరువు కరాళ నృత్యం చేస్తోంది. దాదాపు 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. సగటున 11.4 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. 500 ఫీట్ల లోతు వరకు బోర్లు వేసినా నీరే కానరావడం లేదు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉన్నది. ఎండిపోతున్న పంటలను కాపాడుకోవడానికి రైతన్నలు నానా కష్టాలు పడుతున్నారు. ఇక నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద పంటలు పండించే రైతుల దుస్థితి వర్ణనాతీతం. ఈ ప్రాంత రైతులకు సాగర్ జలాలే ప్రధాన నీటివనరు. సాగర్ ఆయకట్టు కింద చాలా ప్రాంతాల రైతులు యాసంగి పంట సాగు చేయకపోవడం అక్కడి దుస్థితికి అద్దం పడుతోంది.ఆశ్చర్యమేస్తోంది.. విస్మయం కలుగుతోంది. కేవలం నాలుగు మాసాలలో ఒక వ్యవస్థ ఇంతలా అతలాకుతలమవుతుందా? ఉన్నట్టుండి ఈ అనావృష్టికి కారణం ఏమిటి? గత పదేండ్లలో లేని కరువు ఇప్పుడెలా వచ్చింది? 'గత పదేండ్లు వర్షాలు నిరంతరం పడ్డాయి కాబట్టి.. చెరువులు నిండాయి. అందుకే కరువు రాలేదు. కానీ, గత సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదైంది అందుకే కరువు వచ్చింది' అని ప్రభుత్వం చెప్తున్నది. కానీ, గత సీజన్‌లో అంటే జూన్ 1 నుంచి ఇప్పటివరకు తెలంగాణలో నమోదైన వర్షపాతం 920.9 మిల్లీ మీటర్లు. తెలంగాణ సాధారణ వర్షపాతం 879.4 మిల్లీ మీటర్లు. అంటే సాధారణం కంటే గత సీజన్‌లో 5 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో సాధారణం (785.7 మి.మీ) కంటే ఒక శాతం ఎక్కువ (793.6 మి.మీ) వర్షపాతం నమోదైంది. ఇవి వాతావరణ శాఖ చెప్తున్న లెక్కలు.వానాకాలం సీజన్‌లో నైరుతి రుతుపవనాల వల్ల సాధారణ వర్షపాతం నమోదవగా.. ఈశాన్య రుతుపవనాల వల్ల వర్షపాతం పెద్దగా నమోదవలేదు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు బాగానే పడ్డాయి. మరి చెరువులు ఎందుకు నిండలేదు? నీళ్లు ఎందుకు రాలేదు. గత పదేండ్లలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతూ వచ్చింది. ప్రస్తుత సీజన్‌లోనూ వర్షపాతం మైనస్‌లోకి పడిపోలేదు. అయినా కరువొచ్చింది. విచిత్రమేమంటే గత రెండు దశాబ్దాలలో అంటే 2004 నుంచి తెలంగాణలో నమోదైన సగటు వర్షపాతాన్ని కనుక మనం గమనిస్తే.. ఏటా 614-1100 మి.మీ. వర్షపాతం నమోదవుతూ వస్తున్నది. ఇది దాదాపు సగటు వర్షపాతమే. మరి 2004- 2014 వరకు తెలంగాణ ఎందుకు కరువుతో అల్లాడిపోయింది? తెలంగాణ సిద్ధించాక ఎందుకు పంట ఉత్పత్తి పెరగటం? 2014లో స్వరాష్ట్రం సిద్ధించినప్పుడు 68 లక్షల టన్నులు ఉన్న పంటల ఉత్పత్తి ఒక్కసారిగా దాదాపు 3 కోట్ల టన్నులకు ఎలా పెరిగింది? అదే ఆశ్చర్యం. కాలం కలిసొచ్చినప్పుడు మోడువారిన చెట్టు కూడా తిరిగి ప్రాణం పోసుకుంటుంది. 2014లో తెలంగాణ కాలం మొదలైంది. ఇవాళ మళ్లీ కాలం వెనక్కి పోయిందా? అని అనిపిస్తోంది. ప్రాణం పోసుకున్న తెలంగాణ తిరిగి మోడువారుతున్నదేమో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది.సోషల్ మీడియాలో, టీవీ చర్చల్లో తెలంగాణపై సానుభూతి ముసుగేసుకుని మేధావులమని చెప్పుకునే కొందరు తెలంగాణ నీటి వనరులపై అద్భుతమైన పరిజ్ఞానం ఉన్నట్టు మాట్లాడుతుంటారు. ఇటీవల ఓ పత్రికలో ఒక వ్యక్తి వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో.. 'అమ్మో! అంతంత పెద్ద మోటర్లు పెట్టి నీళ్లను ఎత్తిపోస్తారా? ఎంత ఖర్చు? మీకు అంత ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. మీకు ప్రాజెక్టులు అవసరం లేదు. మెత్తపంటలు వేసుకొని ఏదో బలుసాకు తిని బతకండి' అన్నట్టుగా అందులో రాశారు. పైగా ప్రాజెక్టులు మొదలు పెట్టిననాడే ఈ కూత కూశానని, తన కూత ఎవరికీ వినిపించలేదని కూడా వక్కాణించారు. మరో పెద్దాయన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను టేబుల్ టాప్ రిజర్వాయర్ అని ఎద్దేవా చేశారు. ఎన్ని చెప్పినా వాళ్లు మారరు. కొత్త కొత్త ఈకలు పీకుతుంటారు తప్ప.. వాళ్లు చెప్పదలచుకున్న దాని గురించి అంగుళం కూడా వెనక్కి తగ్గింది. తెలంగాణ భౌగోళిక స్వరూపం, ఇక్కడి నీటిపారుదల వ్యవస్థ గురించి పూర్తిగా అవగాహన ఉన్నవారెవరూ ఇలా అడ్డగోలుగా వ్యాఖ్యానాలు చేస్తారు.కరువు ముంగిట తెలంగాణ నిలుచున్న ప్రస్తుత తరుణంలో కాళేశ్వరం ప్రస్తావన తీసుకురావడం తప్పడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి సమగ్రంగా, సమర్థంగా ప్రజలకు అవగాహన కల్పించడంలో బీఆర్ఎస్ నాయకులు విఫలమయ్యారనే చెప్పాలి. కాళేశ్వరం ప్రయోజనాల కంటే.. కేసీఆర్‌పై తీవ్రమైన ద్వేషంతో ప్రతిపక్షాలు, కొందరు కుహనా మేధావులు చేసిన దుష్ప్రచారమే ఎక్కువగా ప్రజల్లోకి వెళ్లింది. గతంలో వైఎస్ఆర్ హయాంలో రూపొందించిన ప్రాణహిత-చేవెళ్లకు కాళేశ్వరానికి మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటో ఎవరైనా ఆలోచించారా? కాళేశ్వరం ప్రాజెక్టు కిందకు వెళ్లి తుమ్మిడిహట్టికి బదులు మేడిగడ్డ దగ్గర.ఒకటి రెండు రిజర్వాయర్లు కొత్తగా వచ్చిచేరాయి. మిగిలినవన్నీ పాత డిజైన్‌లో భాగమే. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు కడితే గ్రావిటీ ద్వారా నీళ్లు ఎల్లంపల్లికి వస్తాయన్నది కాంగ్రెస్ వాదన. మేడిగడ్డ దగ్గర కడితే ఎత్తిపోసినా ఎక్కువ నీళ్లు తీసుకోవాల్సింది కేంద్ర జల సంఘం ఇచ్చిన సూచన. సరే ఈ రాజకీయ ఆరోపణలు చాలాకాలంగా కొనసాగుతున్నవే. రాజకీయ నాయకులు ఎలాంటి ఆరోపణలైనా చేసుకుంటారు.తెలంగాణ ప్రజల ప్రయోజనాలు మనకు ముఖ్యం. కాళేశ్వరం ప్రాజెక్టు స్వరూపం చాలామందికి అర్థం కాలేదు. బాహుబలి మోటర్లు, నీళ్లు ఎత్తిపోవడం, ఎక్కువ ఖర్చు కావడం.. అందరూ ఈ లెక్కలు బాగానే చెబుతున్నారు. కానీ, కాళేశ్వరం అన్నది కష్టకాలానికి అన్న మాట ఎవరికీ పట్టడం లేదు. తెలంగాణలో గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మాత్రమే చేసి వదిలిపెట్టలేదు. దానికి అనుసంధానంగా మిషన్ కాకతీయ కింద 47 వేల చెరువులను పునరుద్ధరించింది. కాళేశ్వరం, చెరువులను బాగుచేయడం అన్నది పరస్పర ఆధారితాలు అన్న విషయం ఎవరికీ అర్థం కావడం లేదు, కాదు కూడా. గత జూలైలో మేడిగడ్డకు ప్రాణహిత నుంచి లక్ష క్యూసెక్కుల వరద వచ్చింది.ఈ నీటిని ఒడిసి పట్టేందుకు మేడిగడ్డ చాలా కీలకం. తుమ్మిడిహట్టి వద్ద ఇంత వరద ఉండదు, రాదు కూడా. పైన గోదావరి నుంచి కూడా చుక్క నీరు రాదు. నిజమే బాహుబలి మోటర్లు, భారీగా విద్యుత్తు ఖర్చు అవుతుందని రాజకీయ ఇంజినీర్లు, కేసీఆర్ విద్వేషకులు పదేపదే చెప్తున్నారు. నిజానికి కాళేశ్వరం నుంచి 180 టీఎంసీల నీటిని ఎన్ని రోజులు ఎత్తిపోస్తారో ఎవరికైనా కనీస సోయి ఉందా? సంవత్సరం మొత్తంలో 90 రోజులు. జూలై- ఆగస్టు మాసాల్లో కొన్ని రోజులు. డిసెంబర్- జనవరి మాసాల్లో మరి కొన్ని రోజులు. మిగిలిన 275 రోజులు కాళేశ్వరం మోటర్లతో పెద్దగా పని ఉండదు. అంటే కరెంటు ఖర్చు కాదు. గత ఐదు సీజన్లలో ఏడాదికి పది మాసాల పాటు నీళ్లు ఎందుకు అందుబాటులో ఉన్నాయి.భూగర్భ జలాలు ఎందుకు అడుగంటి పోలేదు? ఎందుకంటే.. కాళేశ్వరంలో ఎత్తిపోసిన నీళ్లు 15 రిజర్వాయర్ల ద్వారా దాదాపు 13 జిల్లాల్లోని చెరువులకు చేరాయి. దీనివల్ల వానొచ్చినా, రాకపోయినా ఎలాంటి సమస్య ఉండదు. చెరువుల్లో నీళ్లను రైతులు తమ అవసరాలకు తగ్గట్టు

# బీజేపీకి రైతు సెగ.. ప్రచారానికి వస్తే అభ్యర్థులను అడిగేందుకు 11 ప్రశ్నలు సిద్ధం



చండీగఢ్,లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని పంజాబ్, హర్యానాలో రైతులు గట్టి దెబ్బ కొట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నూతన సాగు చట్టాల ఎపిసోడ్ నుంచి కమలం పార్టీ రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. మోదీ సర్కార్ హామీలతో ఏడాది పాటు సాగిన రైతాంగ ఉద్యమాన్ని విరమించిన అన్నదాతలు.. ఇప్పుడు ఆ హామీలను కేంద్రం మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధనకు 'ఢిల్లీ చలో'కు అడ్డంకులు సృష్టించడంపై మండిపడుతున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన విధంగా బుద్ధి చెబుతామని పంజాబ్, హర్యానా రైతులు హెచ్చరిస్తున్నారు. బీజేపీ అభ్యర్థులను ఓడించాలని రైతు సంఘాల నేతలు ప్రజలకు. బీజేపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి వచ్చిన సమయంలో అడిగేందుకు 11 ప్రశ్నలను సిద్ధం చేశారు. ఇందులో ఎంఎస్పీకి చట్టబద్ధత, రైతు రుణాల మాఫీ, ఇటీవల ప్రారంభించిన 'ఢిల్లీ చలో' అడ్డుకోవడానికి సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి.

**ఓట్లడిగే హక్కు ఆ పార్టీకి లేదు..**

ఎస్కేఎం సీనియర్ నేత, ఆలిండియా కిసాన్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రేమ్ సింగ్, బీకేయూ(లఖోవాల్) మీడియాతో మాట్లాడుతూ బీజేపీ సర్కార్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఒక 'రైతు, ప్రజాస్వామ్య, సమాఖ్య' వ్యతిరేక పార్టీ అని, ప్రభుత్వానికి అనుకూలంగా ఉందని. ప్రజల ఓట్లడిగే హక్కు ఆ పార్టీకి లేదని, ఆ పార్టీని ప్రజాస్వామిక, శాంతియుత పద్ధతిలో వ్యతిరేకిస్తానని, ప్రశ్నిస్తామని ప్రేమ్ సింగ్ సూచించింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలని వారు ప్రజలకు ఉన్నారు. బీజేపీ అభ్యర్థులను ప్రశ్నించేందుకు తాము సిద్ధం చేసిన ప్రశ్నలను రెండు పరీక్షలకు పంపుతామని చెప్పారు.

**పలు గ్రామాల్లో ప్రవేశం నిషేధం**

తిరిగి ఇప్పటికే పంజాబ్, హర్యానాల్లోని పలు గ్రామాల్లోకి బీజేపీ నేతల ప్రవేశాన్ని నిషేధించారు. 'రైతులను ఢిల్లీలోకి రానివ్వలేదు. గ్రామాల్లోకి బీజేపీ నేతలు రాకుండా నిషేధిస్తున్నాం' అని రైతులు పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఇటీవల 'ఢిల్లీ చలో' ఆందోళన కార్యక్రమంలో సరిహద్దుల్లో మరణించిన యువరైతు శుభకరణ్‌కు నివాళిగా కొన్ని గ్రామాల్లో బ్యానర్లు ఏర్పాటు చేశారు. 'నేను చేసిన తప్పేంటి? మీ(కేంద్ర ప్రభుత్వం) హామీలను గుర్తుచేయడానికే ఢిల్లీ రావాలనుకున్నాను' అని అందులో రాసివుంది.

**రైతుల 11 ప్రశ్నలు**

- రైతులపైకి బులెట్లు, టియర్ గ్యాస్ ఎవరు ప్రయోగించారు?
- యువ రైతు శుభకరణ్‌ను ఎందుకు కాల్చిచంపారు?
- ఎంఎస్పీకి చట్టబద్ధత ఎందుకివ్వరు?
- లఖింపూర్ ఖీరీ బాధితులకు ఎందుకు న్యాయం చేయలేదు? అజయ్ మిశ్రాను కేంద్ర క్యాబినెట్‌లో ఎందుకు కొనసాగించారు?
- రైతులపై పెట్టిన కేసులను ఎందుకు ఉపసంహరించుకోలేదు?
- రుణాలకు మాఫీ చేస్తున్న మీరు.. రైతు రుణాలను ఎందుకు మాఫీ చేయడం లేదు?
- అమలు చేయబోమని హామీ ఇచ్చిన విద్యుత్ సవరణ చట్టాన్ని పార్లమెంట్‌లో ఎందుకు ప్రవేశపెట్టారు?
- 'కాలుష్య చట్టం' పరిధి నుంచి వ్యవసాయాన్ని ఎందుకు మినహాయించలేదు?
- ఎలక్టోరల్ బాండ్లతో దేశాన్ని ఎందుకు అమ్మేశారు?
- భాక్రా, పాంగ్ డ్యామ్‌లను పంజాబ్ నుంచి ఎందుకు లాక్కొన్నారు?
- సిలోస్ ఏర్పాటు చేసి పంజాబ్‌లో మార్కెటింగ్ వ్యవస్థను ఎందుకు నాశనం చేస్తున్నారు?

## యువకుడి దారుణ హత్య

హైదరాబాద్, పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన హైదరాబాద్‌లోని బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి ప్రగతినగర్‌లో జరిగింది. ఎస్ఆర్ నగర్‌లోని దాసారం బస్తీకి చెందిన తేజస్ (21) అలియాస్ సిద్ధూ.. గత ఏడాది స్థానికంగా జరిగిన ఓ హత్య కేసులో ఏ3 నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసులో జైలుకు వెళ్లి రెండు నెలల క్రితం విడుదలయ్యాడు. ప్రస్తుతం ప్రగతినగర్‌లోని అద్దె ఇంట్లో తన తల్లితో కలిసి నివాసముంటున్నాడు. ఆదివారం రాత్రి సిద్ధూ తల్లి ఊరు వెళ్లింది. దీంతో ఒంటరిగా ఉన్న తేజస్.. తన మిత్రులైన మహేశ్, శివప్ప, సమీర్‌తో కలిసి మద్యం తాగాడు. సోమవారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో ప్రగతినగర్‌లోని బతుకమ్మ ఘాట్ ఎదురుగా నిలబడి ఉండగా.. గతంలో హత్యకు గురైన తరుణ్ స్నేహితులు సుమారు 20 మంది ద్విచక్రవాహనాలపై వచ్చి తేజస్‌ను కత్తులతో పొడిచి చంపారు. హత్య తర్వాత నిందితులు సెల్ఫీ వీడియో ద్వారా చిత్రీకరించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. తరుణ్ హత్యకు ప్రతీకారంగా తమ పగ నెరవేర్చుకున్నామంటూ నిందితులు ఆ పోస్టులో పేర్కొనడం గమనార్హం.

# వరంగల్ ఎంపి అభ్యర్థి ఎంపిక..బిఆర్ఎస్‌కు గట్టి అభ్యర్థులు కరువు

వరంగల్,వరంగల్ బిఆర్ఎస్ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేయాలన్న విషయంలో బిఆర్ఎస్ మల్లగుల్లాలు పడుతోంది. సరైన అభ్యర్థిని ఎంపిక చేయలేక తంటాలు పడుతోంది. ఎంపిక చేసిన కడియం కావ్య జంప్ చేశారు. ఎంపిక చేద్దామనుకున్న ఆరూరి రమేశ్ బిజెపిలో చేరారు. దీంతో ఇప్పుడు అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ నియోజకవర్గం కావడంతో కష్టంగా మారింది. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీలోని కీలకమైన నేతలు కాంగ్రెస్, బీజేపీల్లోకి వెళ్లారు. ఇక్కడి నుంచి బలమైన అభ్యర్థిని బరిలో దించాలనే ఆలోచనలో అధిష్ఠానం ఉంది. అయితే నాయకులు పోయినంత మాత్రనా కేడర్ వెళ్లదని గులాబీ నేతలు నమ్ముతున్నారు. దీంతో పాటు కడియం శ్రీహరి ఎపిసోడ్‌ను ఎన్నికల అస్త్రంగా మల్చుకుని ఓట్ల వేటలో దిగాలనే ఆలోచనలో గులాబీ నేతలు ఉన్నారు. 1వ తేదీన వరంగల్ పర్యటనకు వచ్చిన హరీశ్‌రావు ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో అభ్యర్థి ఎంపికపై చర్చించారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి, వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న పేరును కొంతమంది నేతలు హరీశ్‌రావు దృష్టికెళ్లారు. అయితే జనగామ ఎమ్మెల్యేతో పాటు మరికొందరు నేతలు మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యను పోటీలో దించేతే గట్టి పోటీ ఉంటుందని సూచించారు. వీరితో పాటు తెలంగాణ ఉద్యమకారులైన జోరుక రమేశ్, బోడా డిన్నా, సిరిమిల్ల సదానందం, నిరంజన్ తదితరులు కూడా టికెట్ ఆశిస్తున్నారని హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఉద్యమకారులకు భవిష్యత్తు మంచి అవకాశాలు కల్పిస్తామని, ఈసారి వరంగల్ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుంటున్నామన్నారు. అంగ బలంతో పాటు ఆర్థికంగా బలమైన నేతను బరిలో దించాలని అధిష్ఠానం ఆలోచనగా హరీశ్‌రావు చెప్పినట్లు సమాచారం.మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ సైతం వరంగల్‌పై ఫోకస్ చేశారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలతో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. టికెట్ విషయంపై చర్చించినట్లుగా తెలిసింది. అయితే స్థానికేతరులైన మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, బాల్క సుమన్‌లు కూడా వరంగల్ టికెట్ అడుగుతున్నట్లుగా సమాచారం. అయితే వరంగల్ స్థానం నుంచి పోటీ చేసిన స్థానికేతరులు ఇప్పటి వరకు ఎవరు గెలువలేదని, స్థానికులకే టికెట్ ఇవ్వాలని వరంగల్ జిల్లా ప్రతినిధులు కేసీఆర్‌ను కోరినట్లుగా సమాచారం. దీంతో ఒకటి రెండు రోజుల్లో వరంగల్ అభ్యర్థిని ఖరారు చేస్తామని కేసీఆర్ నేతలకు హామీ ఇచ్చినట్లుగా తెలిసింది. పెద్ది స్వప్న లేదంటే తాటికొండ రాజయ్యలల్లో ఒకరికి టికెట్ పక్కా అనే చర్చ గులాబీ పార్టీ నేతల నుంచి వినిపిస్తోంది. అయితే తెలంగాణ ఉద్యమకారులల్లో బోడా డిన్నా టికెట్ కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. మాదిగ సామాజిక వర్గం నేతకే టికెట్ ఇవ్వాలని పార్టీ భావిస్తే రాజయ్య కాదంటే డిన్నా పేరును పరిశీలించే అవకాశం ఉంది. మొత్తానికి కాంగ్రెస్, బీజేపీలకు దీటుగా అభ్యర్థిని బరిలో దించాలనే ఆలోచనలో బీఆర్ఎస్ ఉంది. దీంతో ఓరుగల్లు పోరు రసవత్తరంగా మారుతుంది.వరంగల్ లోక్‌సభ సీటుపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఇక్కడ పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఇప్పటికే కడియం కావ్యను కాంగ్రెస్ బరిలోకి దించగా, బీజేపీ నుంచి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ పోటీ చేస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు కూడా గులాబీ పార్టీ నుంచి వలస వచ్చిన వారే. ఈ నేపథ్యంలో కారు పార్టీకి అభ్యర్థి కరువయ్యారు. కడియం కావ్యను తమ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత ఆమె రాజీనామా చేసి కాంగ్రె?సలో చేరి ఆ పార్టీ నుంచి పోటీకి దిగుతున్నారు. దీంతో గులాబీ పార్టీ ఈ స్థానాన్ని సవాల్‌గా తీసుకుంది. బలమైన అభ్యర్థిని బరిలో దించేందుకు కసరత్తు చేస్తోంది. మరోవైపు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు నిత్యం ప్రజల్లోకి వెళ్తూ ప్రచారంలో మునిగిపోయారు. 2009లో పునర్విభజనలో భాగంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో వరంగల్ పార్లమెంట్ ఏర్పడింది. వరంగల్ తూర్పు,




వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, పరకాల, వర్ధన్నపేట, స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి నియోజకవర్గాలతో ఈ స్థానం ఎస్సీ రిజర్వుడుగా ఏర్పడింది. 2009లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్య విజయం సాధించారు. ఆ తర్వాత 2014లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కడియం శ్రీహరి విజయం సాధించారు. 2015లో శ్రీహరి ఎంపీ స్థానానికి రాజీనామా చేసి, ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పసునూరి దయాకర్ విజయం సాధించారు. 2019 ఎన్నికల్లోనూ దయాకర్ కారు గుర్తుపై మరోసారి విజయం సాధించారు. 2009 నుంచి 2019 వరకు నాలుగుసార్లు ఎన్నికలు జరిగితే మూడు పర్యాయాలు కారు పార్టీ విజయం సాధించింది. వరంగల్‌లో తెలంగాణ ఉద్యమం బలంగా ఉండటం ఆ పార్టీకి కలిసి వచ్చింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సైతం ఇటీవల కాంగ్రెస్‌లో చేరడంతో పాటు ఆయన కుమార్తెకే టికెట్ కేటాయించడంతో గులాబీ కోటకు బీటలు వారుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. వరంగల్ ఎంపీ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను పార్టీలో చేర్చుకుని బీజేపీ ఆయనకు టికెట్ ఇచ్చింది. అంగ బలంతో పాటు ఆర్థికంగా బలమైన నేత కావడంతో బీజేపీ ఆరూరిని ఆకర్షించింది. దీనికి తోడు వరంగల్ పార్లమెంట్ పరిధిలో బలమైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం.. తమకు కలిసి వస్తుందనే ఆశతో కమలనాథులు ఉన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకాధ్యక్షులు మంద కృష్ణమాదిగ సొంత జిల్లా కావడంతో ఆయన కూడా బీజేపీ గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా ఖరారైన రమేశ్ బీజేపీ కీలక నేతలను మర్యాదపూర్వకంగా కలవడంతో పాటు నియోజకవర్గా స్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రచారంలో మిగతా పార్టీలకంటే ఆయన ఒక్క అడుగు ముందుగానే ఉనన్నారు. అలాగే కాంగ్రెస్ కూడా తమ అభ్యర్థిగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కావ్యను బరిలో దించింది. ఈ టికెట్ కోసం 42 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే కాంగ్రెస్ నేతలు దొమ్మాటి సాంబయ్య, శనిగపురం ఇందిరాలో ఒకరికి టికెట్ ఖారారవుతుందని అంతా భావించారు.అనూహ్యంగా బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారై, ప్రచారం చేసుకుంటున్న కడియం కావ్యను పార్టీలోకి ఆహ్వానించి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యేలతో పాటు ఇప్పటికే కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేసి నిరాశకు గురైనా ఆశావహులను కలిసి తనకు సహకారం అందించాలని కావ్య కోరుతున్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఈ పార్లమెంట్ స్థానం ఇన్‌చార్జిగా నియమించి, అసంతృప్తులను బుజ్జగించే పని అప్పగించారు. ఈనెల 6న తుక్కుగూడలో జరిగే బహిరంగ సభ అనంతరం ప్రచారాన్ని ముమ్మరం చేయాలని కాంగ్రెస్ నేతలు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

# పండగలతో కొత్త ఉత్సాహం

యాదాద్రి: మనిషిని ఎప్పటికప్పుడు కొత్తశక్తితో ముందుకు తీసుకుని వెళ్లగల చోదకం పండగలదే. కాలానికి ఎటువంటి గాయాలనైనా మాన్పగలిగే శక్తి ఉంది. అందుకే కాలం గడిచిన కొద్దీ పాత జ్ఞపకాలు పోయి కొత్త ఉత్సాహం నిండుతుంది. ఇలాంటి వాటి కోసమే పండగలు ఉన్నాయి. ఒక్కో అవసరానికి అనుగుణంగా ఒక్కో పండగ ఉంటుంది. ఉగాది కూడా ఇందులో భాగంగానే చూడాలి. కొత్తగా సాగుదామన్న ఆలోచనతో లేదా ఉత్సాహంతో ఉగాది మనకు శక్తిని ఇస్తుంది. పండగలకు లేదా కాలనికి అంత శక్తి ఉంది. ఉగాది కూడా అందులో భాగంగానే భావించాలి. షడ్రుచుల పచ్చడి, భక్ష్యం, పులిహోర ఇలా విభిన్న రుచులతో పండగ చేసుకుంటాం. కొద్ది రోజులు... సంవత్సరాలు... కొన్నిసార్లు జీవితకాలంలో ఆ గాయం మానకపోవచ్చు! ప్రతి ఒక్కరూ ఎవరికి వారుగా జీవించడంతో పాటు- వ్యక్తిగత అవసరాలు, అభిప్రాయాలు భిన్నంగా ఉండటం, ఒక్కొక్కరు ప్రపంచాన్ని చూసే దృక్పథం ఒక్కోలా ఉండటం సంభవిస్తుంటాయి. భారతీయ సంప్రదాయంలో పండలకు విశిష్ట స్థానం ఉంది. మనుషుల భావావేశాలకు సంబంధించిన విషయాల్లో గాయం, బాధ, దుఃఖాల నివారణ వారి జ్ఞాపకాలను బట్టి ఉంటుంది. నిజానికి కాలం పాత్ర ఇక్కడ పెద్దగా లేదనే అనిపిస్తుంది. వ్యక్తి ఆ బాధ నుంచి బయటపడాలి అనుకొని కూడా తగినంత దృష్టి పెట్టకపోతే, కాలం ఏమీ చేయలేదు. ఆలోచనల వల్ల, మానసిక స్థైర్యం వల్ల అన్నీ సాధ్యపడతాయి. ఇంద్రియాలు ఎంత త్వరగా కొత్త ఆలోచనల్ని గ్రహిస్తాయో, అంత త్వరగా పాత జ్ఞాపకాలు కనుమరుగవుతాయి. సంకల్పబలమే విజయానికి కారణమవుతుంది. క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొనేటప్పుడు, మనిషిలో నిరాశ చోటు చేసుకుంటూ ఉంటుంది. అటువంటప్పుడు, అసలు ఆ స్థితిని ఎదుర్కోగలమా అనే భయం, ఆందోళన కలుగుతాయి. పరిస్థితి ఎటువంటిదైనా, అది మనిషి ఎదుర్కోలేనంత పెద్దదేమీ కాదు. ఒక్కోసారి, కదలకుండా స్థిరంగా ఉండిపోయినట్లు కాలం భ్రాంతి కలిగిస్తుంది. అది కదిలి వెళ్లిన ప్రతిక్షణం, విజయం దిశగా పయనించే అవకాశాన్ని మనిషికి కల్పిస్తుంది. అవగాహనతో సమస్యను పరిష్కరించు కోవాలనే సంకల్పం అతడిలో దృఢంగా ఉంటే చాలు. అప్పుడు ఎంత జటిల సమస్యనైనా సులువుగా ఎదుర్కోగలిగే శక్తి మనిషికి ఏర్పడుతుంది! కొత్త జీవితాన్ని లేదా కొత్తగా వసంత వేళ నూతన ఆవిష్కరణలకు ఉగాదిని వేదికగా చేసుకుంటాం. ప్రకృతిలోని ప్రతి చర్యా కొన్ని సూత్రాలకు లోబడి ఉంటుంది. స్థిరపడటానికి కొంత సమయమూ అవసరమవుతుంది. ఎటువంటి సంఘర్షణైనా సద్దుమణ గడానికి సమయం కావాలి. పాతగాయం మానడానికి కొంత సమయం పడుతుంది. గాయాల బాధలను అధిగమించి మనోధైర్యంతో సాగడానికి పండగలు, పూజలు, తిథి,వార,నక్షత్రాలు ఎంతగానో దోహద పడతాయి. మనలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. బాధల నుంచి బయటపడటానికి, మనిషికి తగిలిన గాయం మానడానికి ఎంతకాలం పడుతుందో ఎవరూ చెప్పలేరు. ప్రశాంతత లోపించినప్పుడు, సంతోషం దూరమైనప్పుడు మనిషి బాధపడటం సహజమే. తిరిగి ప్రశాంతత ఏర్పడి సంతోషం కలిగినప్పుడే మానసిక ఉల్లాసం ఉంటుంది. అందుకోసం పండగలు మనకు బాగా తోడ్పడతాయి. దీనికి మానసిక అనుభవాలు, దైవశక్తి ఎంతగానో తోడ్పడతాయి. ఓ మనిషి జీవితకాలంలోని కొన్ని జ్ఞాపకాల కూర్పు. కొత్త జ్ఞాపకాలు పాతవాటిని వెనక్కి తోస్తుంటాయి. అప్పుడు చూస్తే, ఆ పాతజ్ఞాపకాలు మరో కోణంలో తక్కువ తీవ్రతతో కనపడతాయి. కొత్త అనుభవాల ప్రభావం ఆ గాయం మాన్పే పక్రియను వేగవంతం చేస్తుంది. అయినా కాలం గాయాన్ని మాన్పుతుందని చెప్పు కోవడానికి పండగలతో ఆనందాన్ని ఆస్వాదిస్తాం. అవన్నీ కూడా పండగలు, ఆచారాలు, పూజలతో కలుగుతుంది. అందుకే ఏ మతంలో లేనన్ని పండగలు ఆచారాలు హిందూ సంప్రదాయంలో ఉన్నాయి.

# చిత్తూరులో వేడెక్కుతున్న రాజకీయం

చిత్తూరు,ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాజకీయ వేడి సెగ పుట్టిస్తోంది. బద్ధ శత్రువుల మధ్య ఘాటైన విమర్శలు రాజకీయ వేడిని పెంచుతున్నాయి. పెద్దిరెడ్డి వర్సెస్ నల్లారి మధ్య పొలిటికల్ ఫైట్ కాక రేపుతోంది. మంత్రి పెద్దిరెడ్డి ప్రాతినిత్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంపై ఫోకస్ పెట్టిన రాజంపేట పార్లమెంటు కూటమి అభ్యర్థి మాజీ సీఎం కిరణ్ ఘాటైన విమర్శలే చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి కిరణ్‌పై కూడా అదే రీతిలో కౌంటర్ అటాక్ ఇస్తున్నారు మంత్రి పెద్దిరెడ్డి. రాజంపేట పార్లమెంటు వైసీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి బరిలో నిలిచారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న రెండు కుటుంబాల మధ్య వైరం ఇప్పుడు ఇప్పుడు మరోమారు ఎన్నికల సవాళ్లకు వేదికగా మారింది. నాలుగు రోజుల క్రితం పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డిపై కిరణ్ చేసిన కామెంట్స్, ఆ మరుసటి రోజే కిరణ్‌పై మంత్రి పెద్దిరెడ్డి కౌంటర్ అటాక్ జరిగింది. ఆదివారం రొంపిచర్లలో పర్యటించిన రాజంపేట బిజెపి అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. పనిలో పనిగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన మాజీ సీఎం కిరణ్ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని టా÷-గ్గ÷ట్ చేశారు. పెద్దిరెడ్డి ఫ్యామిలీ పాడి, మామిడి రైతాంగాన్ని నిలువు దోపిడీ చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి అంటే పెద్దిరెడ్డి కుటుంబం మాత్రమే అభివృద్ధి అని విమర్శించారు. అనుమతులు లేకుండా పెద్దిరెడ్డి కుటుంబం చేసిన రెండు ప్రాజెక్టు పనులకు రూ.100 కోట్లు జరిమానా విధించిందని ఇదంతా ఎవరి సొమ్ము అని మాజీ సీఎం కిరణ్ కుమార్ ప్రశ్నించారు . పెద్దిరెడ్డి ఆయన కుటుంబం అధికార ఆహంతో పోలీసుల అండ చూసుకొని రెచ్చిపోతుందన్నారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తే పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. పుంగనూరు ప్రాంతంలో 5ఏళ్లలో చేసిన నిర్వాహకమేంటని ప్రశ్నిస్తే తాను ఓటమి భయంతో మాట్లాడుతున్నానని విమర్శిస్తున్నారని కిరణ్ అన్నారు. మట్టి, మైన్స్, రెడ్ శాండిల్, ఇసుకలో భారీ దోపిడీ జరిగిందని ఈ ప్రాంత అభివృద్ధిని బాధ్యతగా తీసుకుంటానని హామీ ఇచ్చారు. బెదిరింపులకు అక్రమ కేసులకు భయపడకుండా ప్రజలు ఓటు వేయాలని కేంద్ర బలగాల భద్రతతో ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు కిరణ్. తిరుపతి ఉప ఎన్నికల్లో 35 వేల దొంగ ఓట్లపై సిబిఐ విచారణ జరిపిస్తామన్నారు. ఇది అతి పెద్ద క్రైమ్?గా అభిప్రాయపడ్డ కిరణ్ దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. సిబిఐ విచారణ కన్నా ముందు ఓటుతో పెద్దిరెడ్డిని చిత్తుగా ఓడించాలని పిలుపు నిచ్చారు మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి.

## ఎన్నికల వేళ తనికీలు విస్తృతం

బెంగళూరు,లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కర్ణాటకలో భారీగా అక్రమ నగదు, బంగారం బయటపడటం తీవ్ర కలకలం రేపింది. బళ్లారిలో ఓ వ్యాపారి ఇంట్లో పోలీసులు సోదాలు జరపగా.. రూ.7.6 కోట్ల నగదు, బంగారు, వెండి ఆభరణాలను గుర్తించారు. బళ్లారిలో హవాలా కార్యకలాపాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం రావడంతో బ్రూస్‌పేట్ పోలీసులు రంగంలోకి దిగారు. స్థానిక ఆభరణాల వ్యాపారి నరేశ్ సోనీ ఇంట్లో ఆకస్మిక సోదాలు చేపట్టారు. లెక్కల్లోకి రాని భారీ నగదు, ఆభరణాలను గుర్తించారు. రూ.5.6 కోట్ల కరెన్సీ, 103 కిలోల వెండి ఆభరణాలు, 68 వెండి కడ్డీలు, 3 కిలోల బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# బయటపడుతున్న కీలక ఆధారాలు

నల్లగొండ,సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పోలీసుల పాత్ర ఒక్కొటిగా వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నల్లగొండ జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రౌడీ షీటర్లతో కలిసి సెటిల్‌మెంట్లు, గంజాయి కేసు నిందితులు, పేకాట నిర్వాహకులు, ఇతర నేరస్తులను టార్గెట్ చేసి రూ.కోట్లలో వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో తేలింది.రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజుకో కొత్త అంశం వెలుగులోకి వస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్నికల సమయంలో జిల్లాకు చెందిన నేతల కదలికలను పసిగట్టేందుకు నల్లగొండలోనే వార్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న నలుగురు అధికారులు గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పనిచేసిన వారే. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు 2015లో నల్లగొండ జిల్లా ఎస్పీగా పనిచేశారు. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు నల్లగొండలో ఓఎస్డీగా పని చేశారు. ఏఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులు కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. డీఎస్పీ ప్రణీత్ రావు.. ఎస్సైగా జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేశారు. సీఐ గట్టు మల్లు కూడా నల్లగొండ జిల్లాలో పనిచేశారు. ఇక్కడ పనిచేసిన సమయంలోనే వీరికి సన్నిహితంగా మెలిగిన టాస్క్ ఫోర్స్ కానిస్టేబుళ్లకు వార్ రూమ్ లో వీరికి కీలక బాధ్యతలు అప్పగించారు.విపక్ష నేతల ఫోన్లతోపాటు రైస్ మిల్లర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గంజాయి వ్యాపారులు, ఇతర పారిశ్రామిక యజమానుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లుగా దర్యాప్తు బృందం గుర్తించింది. వార్ రూమ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా మిల్లర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గంజాయి వ్యాపార్లను బెదిరించి ఈ కానిస్టేబుళ్లు భారీ అక్రమాలకు పాల్పడ్డారట. అక్రమ దందాలు చేసే రైస్ మిల్లర్ల నుంచి నెలవారీ మామూళ్లు, పేకాట శిబిరాల నిర్వాహకుల నుంచి వసూళ్లు చేసేవారనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని ముఖ్యమైన పట్టణానికి చెందిన రౌడీ షీటర్ తో కలసి ఓ కానిస్టేబుల్ భూ దందాలు, సెటిల్మెంట్లు చేసినట్లు అధికారులు నిర్ధారించారు.ట్యాపింగ్‌ను అడ్డుపెట్టుకొని ఈ కానిస్టేబుళ్లు.. ఓవైపు రాజకీయ నేతలకు అవసరమైన ఫోన్లతో పాటు, మరోవైపు సొంత వ్యవహారాలకు కూడా వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. వార్ రూమ్ సామాజాన్ని అడ్డుగా పెట్టుకొని టాస్క్ ఫోర్స్ పోలీసులు.. కొందరు మహిళల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళల ఫోన్లను ట్యాప్ చేసి వ్యక్తిగత సంభాషణలు విని లోబర్చుకునేవారని అధికారులు దర్యాప్తులో తేలింది. తాము కన్నేసిన మహిళలు, ఉద్యోగినుల వ్యక్తిగత జీవితాలను సైతం సదరు కానిస్టేబుళు టార్గెట్ చేశారు. నల్లగొండ వార్ రూమ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 40 మంది మహిళలను లైంగికంగా వేధించారు. నల్లగొండ వార్ రూమ్?లో కీలకంగా పని చేసిన సదరు కానిస్టేబుల్.. అక్రమ కేసులో ఓ పోట నాయకుడు అరెస్టయితే దానిని అడ్డుపెట్టుకుని ఆయన కుటుంబ సభ్యులను సదరు కానిస్టేబుల్ బ్లాక్‌మెయిల్ చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వార్ రూమ్ లో పని చేసిన కానిస్టేబుళ్ల నిర్వాకాన్ని బయటకు చెబితే పరువుపోతుందని మహిళలు అప్పట్లో బాధిత మహిళలు రాలేరు. ఇపుడు బాధితుల్లో కొందరు త్వరలో బయటకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ట్యాపింగ్ బృందంలో పని చేసిన కానిస్టేబుళ్ల వ్యవహారంలో కొత్త కోణాలు వెలుగు చూస్తుండడంతో పోలీసు శాఖ, రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది.

## నోరు ఉంది కదా అని పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదు

పెనమలూరు,కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరు మండలం కడపకొల్లు గ్రామంలో ప్రచారం సందర్భంగా మంత్రి జోగి రమేష్ పై టీడీపీ నేత బొడే ప్రసాద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అరేయ్ పిల్ల బచ్చా రోగ్ రమేష్ అంటూ విమర్శించారు. జోగి రమేష్ నువ్వు స్వయం కృషిపై మంత్రి అయ్యావా అని ప్రశ్నించారు.. చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడిచాడా మీకు కళ్ళు కనిపించట్లేదు.. అందరూ కూడా నిన్ను గూర్క అని పిలిచేది అందుకే అంటూ ఆయన మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మంత్రిగా పని చేశారన్నారు. మేము చాలా సంస్కారంగా మాట్లాడుతున్నాము.. నీకు నోరు ఉంది కదా అని పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నాడు.. చంద్రబాబు నాయుడు ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా.. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు అది గుర్తుంచుకో అని బొడే ప్రసాద్ తెలిపారు.నీ స్థాయి ఏంటి జోగి రమేష్ లాగులు వేసుకుని లారీల దగ్గర గుమస్తాగా పని చేశావు అంటూ టీడీపీ నేత బొడే ప్రసాద్ విమర్శించారు. నీకు ఇన్ని కోట్ల ఆస్తులు ఎక్కడ నుంచి వచ్చాయని ప్రశ్నించారు. నిన్ను మైలవరంలో ఛీ కొడితే రాజశేఖర్ రెడ్డి కాళ్లు పట్టుకొని, క్యారేజీలు మోస్తే నిన్ను పెడన పంపారు.. చంద్రబాబు నాయుడు సారథికి వెన్నుపోటు పొడిచారని అంటున్నావు సారథి నూజివీడులో గెలవబోతున్నారు.. అసలైన వెన్నుపోటు జగన్మోహన్ రెడ్డి నీకు పొడిచాడు.. తనపై నువ్వు ఓడిపోయి నీకు రాజకీయ సమాధి కట్టడానికి పెనమలూరు పంపారని విమర్శలు గుప్పించారు. నువ్వు ఎన్ని కోట్ల రూపాయలు ఇక్కడ ఖర్చు పెట్టిన నియోజవర్గ ప్రజలు నన్ను భారీ మెజారిటీతో గెలిపించబోతున్నారు.. ఈ నియోజకవర్గంలో నువ్వు ఓడిపోవడం ఖాయం అని ఓడిపోయాక నువ్వు ఇక్కడే ఉంటావా లేదా ప్రజలకు చెప్పు అని బొడే ప్రసాద్ ప్రశ్నించారు. నువ్వు చంద్రబాబుపై నోరు పారేసుకున్నంత కాలం నేను కూడా ఇలాగే మాట్లాడతాను అని బొడే ప్రసాద్ పేర్కొన్నారు. మీ ప్రభుత్వం రాదని తెలిసే ఎమ్మెల్యేలు, మంత్రులు దుకాణం సర్దేసుకుంటున్నారు. చంద్రబాబు ఇంటిపై దాడి చేసి మంత్రి పదవి పొందావని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబునీ ఎవరైతే ఎక్కువ తిట్టుతున్నారో వారికే మంత్రి పదవులు టికెట్లు ఇస్తున్నారు అని ఆయన ఆరోపించారు. తనపై కాల్ మనీ, సెక్స్ రాకెట్లు అని అంటున్నావు.. అలా అన్న మంత్రి రోజాకు గడ్డి పెట్టాను.. నీకు కూడా అలాగే గడ్డి పెడతానో పెంట పెడతానో చూద్దువు అన్నారు. నీపై ఉన్న అభియోగాలు బయటకు తీస్తే మీ ఇంట్లో వాళ్ళు నీతో కాపురం కూడా చెయ్యరు.. పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడితే రోజాకు పట్టిన గతే మీకు పడుతుంది అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొడే ప్రసాద్ హెచ్చరించారు.

## ఏపీలో పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించిన సీపీఐ(ఎం)

అమరావతి,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేసేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులను ప్రకటించింది. అయితే, లోక్ సభ అభ్యర్థిగా కేవలం ఒకరినే ప్రకటించగా.. 10 అసెంబ్లీ స్థానాలకు క్యాండిడెట్ల పేర్లను వెల్లడించింది. అలాగే, కాంగ్రెస్‌తో పలు దఫాలుగా జరిగిన చర్చల తరువాత అరకు పార్లమెంటు, 5 అసెంబ్లీ (రంపచోడవరం, కురుపాం, గన్నవరం, మంగళగిరి, నెల్లూరు సిటీ) స్థానాలపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు. ఇక, మిగతా 5 స్థానాలపై చర్చలు కొనసాగించి నామినేషన్‌లోగా ఒక అవగాహనకు రావాలని ఇరు పార్టీలు అభిప్రాయ పడుతున్నాయి.

# తెరపై కాషాయం సినిమాలే ప్రచారాస్త్రాలు

న్యూఢిల్లీ : బీజేపీ ప్రాయోజిత వివాదాస్పద చిత్రాలు గత 2019 లోక్‌సభ ఎన్నికల ముందు నుంచీ ఉన్నాయి. 2021 నుంచి ఈ ట్రెండ్ మరింత ఎక్కువైంది. ఈ చిత్రాలకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, యాక్టింగ్‌తో పాటు నిధులను సమకూర్చి నిర్మాతలుగా మారుతున్నదీ బీజేపీ, దాని అనుకూల నాయకులే కావటం గమనార్హం. దేశంలోని అన్ని సమస్యలకు కాంగ్రెస్, లెఫ్ట్ వంటి పార్టీలు, వాటి అనుబంధ సంఘాలే కారకులుగా, విలన్లుగా చూపించి.. బీజేపీని పరోక్షంగా 'హీరో'గా చిత్రీకరిస్తున్నాయి ఈ వివాదాస్పద చిత్రాలు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందే హిందూత్వ, బీజేపీ అనుకూల కథనాలను ప్రోత్సహించే అనేక హిందీ సినిమాలు విడుదలయ్యాయి. వీటిలో 'స్వతంత్ర వీర్ సావర్కర్', 'జేఎన్‌యూ : జహంగీర్ నేషనల్ యూనివర్శిటీ', ' ఆర్టికల్ 370', 'మై అటల్ హూ' వంటివి ఉన్నాయి. అలాగే, ఈ జాబితాలో గతంలోని స్థానిక పరిస్థితుల ఆధారంగా నిర్మించిన 'బెంగాల్ 1947', 'రజాకార్', 'యాక్సిడెంట్ లేదా కాన్స్పిరసీ: గోధ్రా' వంటి విడుదలైన, విడుదల కానున్న చలనచిత్రాలూ ఉన్నాయి. ఇలాంటి బీజేపీ, హిందుత్వ అనుకూల చిత్రాల పరంపర 2019కి ముందు నుంచే ప్రారంభమై 2024 నాటికి అధికమైందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

'జేఎన్‌యూ: జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ'జ

ఈ చిత్రం లెఫ్ట్ వింగ్ స్టూడెంట్ పాలిటిక్స్‌ను విమర్శిస్తూ రూపొందించారు. టైటిల్ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)ని పరోక్షంగా సూచిస్తుంది. ఈ చిత్రాన్ని మహాకాల్ మూవీస్ ప్రయివేట్ లిమిటెడ్ నిర్మించింది. ఈ కంపెనీ డైరెక్టర్లలో విష్ణు తాంతియా ఒకరు. ఆయన రాష్ట్రంలో బీజేపీతో పొత్తులో ఉన్న హర్యానా రాజకీయ నాయకుడు గోపాల్ కందాగా ప్రసిద్ధి చెందిన గోపాల్ గోయల్ వ్యాపార సహచరుడు. 'భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన' జేఎన్‌యూలో భారతదేశ సంస్కృతి, సమగ్రత కోసం నిలబడే కాషాయ అనుకూల రైట్-వింగ్ 'ఏఐవీపీ' (పరోక్షంగా ఏబీవీపీ), లెఫ్ట్ వింగ్ (ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్) 'జాతీయ వ్యతిరేక' అజెండా మధ్య పోరాటంగా ఈ చిత్రంలో చూపించారు. ఈ సినిమా విడుదల తేదీని వాయిదా వేసినట్టు సమాచారం.

స్వతంత్ర వీర్ సావర్కర్

కరడుగట్టిన హిందుత్వ సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్ సావర్కర్‌పై రూపొందిన ఈ బయోపిక్‌కి రణదీప్ హుడా దర్శకత్వం వహించారు. అతను టైటిల్ పాత్రను కూడా పోషించాడు. ఇది 22 మార్చి 2024న థియేటర్లలో విడుదలైంది. ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరు ఆనంద్ పండిట్. ఆయన 30 ఏండ్లకు పైగా బీజేపీ సభ్యుడిగా ఉన్నారు. ఒక ప్రముఖ వార్త కథనం ప్రకారం అతను మహారాష్ట్ర బీజేపీ కోశాధికారి.వివేక్ ఒబెరారు నటించిన 'పీఎం నరేంద్ర మోడీ' బయోపిక్‌కి కూడా పండిట్ నిర్మాత. ఆ చిత్రం కూడా 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందే విడుదల కావటం గమనార్హం. పండిట్..మోడీకి సన్నిహితుడు అని కూడా తెలుస్తున్నది. 2013లో ఫెమా ఉల్లంఘన కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) పండిట్‌ను విచారిస్తున్నది. ఇంటర్నేషనల్ కన్సార్టియం ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టు విడుదల చేసిన ఆఫ్‌షోర్ ఖాతాదారుల డేటాబేస్‌లో అతని పేరు కూడా ఉన్నది.

'మై అటల్ హూ'

పండిట్‌తో పాటు 'పీఎం మోడీ', 'సావర్కర్' బయోపిక్‌లను నిర్మించిన వ్యక్తులలో ఒకరు సందీప్ సింగ్. పంకజ్ త్రిపాఠి నటించిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిపై ఇటీవల నిర్మించిన 'మై అటల్ హూ' నిర్మాతలలో కూడా అతనొకడు. సందీప్ సింగ్‌కి బీజేపీతో సంబంధాలున్నాయని ఆప్ గతంలో ఆరోపించింది. 2020లో, సందీప్ సింగ్ మాదకద్రవ్యాల ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పుడు, బీజేపీకి 53 కాల్స్ చేశారని కాంగ్రెస్ ఆరోపించింది.

రజాకార్..

హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోకి డబ్ అయిన తెలుగు సినిమా 'రజాకార్: ది సైలెంట్ జెనోసైడ్ ఆఫ్ హైదరాబాద్'. సమరవీర్ క్రియేషన్స్ పతాకంపై గూడూరు నారాయణరెడ్డి నిర్మించారు. నారాయణరెడ్డి తెలంగాణలో బీజేపీ కార్యనిర్వాహక కమిటీలో భాగం. అతను 2023 అసెంబ్లీ ఎన్నికలలో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి పార్టీ అభ్యర్థి. కేవలం 9200 ఓట్లు మాత్రమే సాధించి డిపాజిట్‌ను కూడా కోల్పోయారు.

ప్రమాదం లేదా కుట్ర: గోధ్రా

గుజరాత్‌లో 2002 గోధ్రా రైలు మారణహోమంపై రెండు సినిమాలు 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు విడుదల కావాల్సి ఉంది. విక్రాంత్ మాస్సే నటించిన 'ది సబర్మతి రిపోర్ట్'ను ఏక్తా కపూర్ బాలాజీ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా.. ఓం త్రినేత్ర ప్రొడక్షన్స్, ఆర్ట్‌వర్స్ స్టూడియోస్ నిర్మించిన చిత్రం 'యాక్సిడెంట్ ఆర్ కాన్స్పిరసీ: గోధ్రా'. ఇందులో రణ్‌వీర్ షోరే, మనోజ్ జోషి, హితు కనోడియా నటించారు. గుజరాతీ నటుడు కనోడియా 2017 నుంచి 2022 వరకు గుజరాత్‌లోని ఇదార్ నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా కూడా ఉన్నారు. అతని తండ్రి




నరేష్ కనోడియా కూడా బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. అతని మామ మహేష్ కనోడియా బీజేపీ ఎంపిగా ఉన్నారు. అనేక హిందీ, గుజరాతీ సినిమాలలో కూడా నటించిన మనోజ్ జోషి.. బీజేపీ ప్రచార ప్రకటనలలో కూడా కనిపించారు. గోధ్రా సినిమా నిర్మాత బీజే పురోహిత్ కూడా బీజేపీ మద్దతుదారుడే కావటం గమనార్హం.బెంగాల్ 1947 విభజన సమయంలో బెంగాల్‌లో జరిగిన హింసాకాండపై ఈ సినిమా తెరకెక్కింది. హింసాకాండ రెండు వైపులా జరిగినప్పటికీ, హిందువులపై ముస్లింల దురాగతాలపై ప్రధానంగా దృష్టి సారించినట్టు ఈ సినిమాను నిర్మించారని విమర్శకులు అంటున్నారు. గతనెల 29న ఈ చిత్రం విడుదలైంది. ఆకాశాదిత్య లామా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కామ్‌ఫీడ్ ప్రొడక్షన్స్ నిర్మించింది. లామా భారతీయ చిత్ర సాధన(బీసీఎస్) అనే సంస్థకు జాయింట్ సెక్రెటరీగా ఉన్నారు. 2016లో ఏర్పాటైన ఈ సంస్థ ఆరెస్సెస్‌కు అనుబంధంగా ఉన్నది. ప్రముఖ హిందూత్వ సిద్ధాంతకర్తగా పేరుగాంచిన బి.కె కుత్యాల ఈ సంస్థకు చైర్మెన్‌గా ఉన్నారు. బీసీఎస్ సలహా మండలిలో సుభాష్ ఘూరు, హేమ మాలిని, మధుర్ భండార్కర్, వివేక్ అగ్నిహౌత్రి, ప్రియదర్శన్ వంటివారూ ఉన్నారు.

సినిమాలను ప్రమోట్ చేయటంలో బీజేపీ బిజీబిజీ

ఈ సినిమాలను ప్రమోట్ చేయడంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న వ్యక్తులు కూడా చురుగ్గా పాల్గొన్నారు. బీజేపీ ప్రభుత్వాల మద్దతుతో పన్ను మినహాయింపులు, ఉచిత స్క్రీనింగ్‌లు, సోషల్ మీడియా ప్రమోషన్‌లు వంటి ప్రమోషన్ స్ట్రాటజీని వీరు పాటించారు.

గతనెల 13న, ఏబీవీపీ అనుబంధ సంస్థ రాష్ట్రీయ కళా మంచ్ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో దర్శకుడు సుదీప్తో సేన్ 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' ప్రదర్శనను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సేన్, నటి అదా శర్మ పాల్గొన్నారు. వీరిద్దరూ గతంలో 'ది కేరళ స్టోరీ' చిత్రంలో పని చేశారు. ఈ చిత్రం గతేడాది విడుదలైంది. కేరళ రాష్ట్రంలో ఇస్లామోఫోబియా టార్గెట్‌గా దీనిని రూపొందించారు. ఆ సమయంలో కేరళ స్టోరీ సినిమా చట్టపరమైన ఇబ్బందులనూ ఎదుర్కొన్నది. ఏబీవీపీ మార్చి 18న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ క్యాంపస్‌లో కూడా ఈ సినిమా ప్రదర్శనను నిర్వహించింది.

'ఆర్టికల్ 370' : జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ ఇది. 2019లో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన ఈ ఆర్టికల్ ఆధారంగా సినిమాను రూపొందించారు. వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తీసుకున్న మొదటి ప్రధాన నిర్ణయాల్లో ఇది ఒకటి. ఈ చిత్రాన్ని మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు రాజకీయ నాయకులు ప్రచారం చేశారు. వారు థియేటర్‌లలోకి వెళ్లి చూడాలని ప్రజలను కోరారు. బీజేపీ పాలిత ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో ఈ చిత్రం పన్ను రాయితీని పొందటం గమనార్హం. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఈ సినిమా ప్రదర్శనలకు బీజేపీకి చెందిన పలువురు నేతలు హాజరయ్యారు.2019లో కూడా బీజేపీ కార్యకర్తలు 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' సినిమా ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. ఆ ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు 'ఉరి' విడుదలైంది. ఈ రెండు చిత్రాలకు ఆదిత్య ధర్ అనే వ్యక్తి నిర్మాత. 2024లో 'మై అటల్ హూ' మహారాష్ట్ర రాష్ట్ర అసెంబ్లీలో ప్రదర్శించబడింది. మహారాష్ట్ర బీజేపీ నేత నిరంజన్ వసంత్ దావ్‌ఖరే ఈ సినిమా ఉచిత ప్రదర్శనను ఏర్పాటు చేశారు.త్రిపురలో ముఖ్యమంత్రి మాణిక్ సాహా సోదరుడు రటా సాహా అలాంటి స్క్రీనింగ్‌ను మరొకటి నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలు భారీగా ప్రచారం చేసిన మరో చిత్రం 'రజాకార్'. తెలంగాణలోని ప్రజలు సినిమాను చూడాలని కరీంనగర్ ఎంపీ బండి సంజరు కుమార్ విజ్ఞప్తి చేస్తూ.. వినోదపు పన్ను మినహాయించాలని రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. పలువురు బీజేపీ నేతలు ఈ సినిమా ప్రదర్శనలు నిర్వహించారు. "'బెంగాల్ 1947' చిత్రానికి బీజేపీ కంటే ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న వ్యక్తులే ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త రతన్ శారదా, ఆర్ఎస్ఎస్ ఢిల్లీ మీడియా ఇన్‌ఛార్జ్ రాజీవ్ తులి ఇద్దరూ సినిమాను ప్రమోట్ చేస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాగా, పైన చర్చించిన చిత్రాలలో 'బస్తర్', 'మై అటల్ హూ', 'సావర్కర్'లతో పాటు అత్యధిక చిత్రాలు ఘోరంగా విఫలమయ్యాయని సినీ విమర్శకులు అంటున్నారు.

# అటకెక్కిన ధరణి ప్రక్షాళన!



హైదరాబాద్,శాఖలో దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం అనేది నిత్య ప్రక్రియ. ధరణి దాదాపు మూడేండ్లుగా కొనసాగుతూనే ఉన్నది కాబట్టి ఆపాల్సిన అవసరం లేదని అంటున్నారు. ధరణి కమిటీలోని కొందరు సభ్యులు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తంచేసినట్లు ఉద్దేశ్యపూర్వకంగా దరఖాస్తుల పరిష్కారాన్ని నిలిపివేయాలని సూచించినట్లు తెలిసింది. ధరణి పోర్టల్‌పై అధ్యయనానికి, పునర్నిర్మాణానికి ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో కమిటీని నియమించింది.ఐదుగురు సభ్యుల కమిటీ వివిధ దశల్లో చర్చలు జరిపి ప్రభుత్వానికి తొలివిడతగా కొన్ని సూచనలు చేసింది. దీని ప్రకారం ప్రభుత్వం ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి మార్చి 1వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ పేరుతో కార్యక్రమం ప్రారంభమైంది. ధరణిలో వివిధ మాడ్యూళ్ల కింద మొత్తం 2,46,536 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 9 రోజుల్లోగా పరిష్కరిస్తామని ప్రకటించారు. తహసీల్దార్‌స్థాయి నుంచి సీసీఎల్ఏ వరకు కమిటీలు వేసి, వారికి పరిష్కార బాధ్యతలు అప్పగించారు.ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి నివేదిక వచ్చిన తర్వాత పరిష్కరించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు గరిష్ఠంగా వారం రోజుల గడువు విధించింది. క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తయ్యాక తహసీల్దార్, ఆర్డీవోకు, కలెక్టర్‌కు నివేదికలు అందించడం, దరఖాస్తు చేయడం డిస్‌పోజ్ 9 రోజుల్లో సాధ్యం కాదని నిపుణులు అప్పుడే స్పష్టం చేశారు. అప్పట్లో మార్చి మొదటివారంలో ఎన్నికల కోడ్ వస్తుందనే ప్రచారం జరగడంతో తూతూమంత్రంగా నాలుగైదు రోజులు హడావుడి చేసి, కోడ్‌ను అడ్డం పెట్టుకొని నిలిపివేసి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు స్పెషల్ డ్రైవ్ నాటకం ప్రారంభమైందని ఆరోపణలు కూడా వచ్చాయి. దీనికి తగ్గ ప్రభుత్వం మొదటి 9 రోజుల్లో ఒక్కటే దరఖాస్తును కూడా పరిష్కరించలేదు.ఎన్నికల కోడ్ రా స్పెషల్ డ్రైవ్‌ను మార్చి 17 వరకు పొడిగిస్తూ 11న ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వం అంచనా వేసినట్టే కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. కోడ్‌ను సాకుగా చూపి ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌కు బ్రేకులు వేసింది. ఆధార్ సీడింగ్, దోషాలు, పేర్లు తప్పుగా పడడం వంటి చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా పక్కన పెట్టేయడంతో రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పార్ట్-బి దరఖాస్తులకూ దిక్కులేదు

భూ సమస్యలకు సంబంధించి హక్కుల్లో స్పష్టత లేని భూములను అధికారులు పార్ట్-బి అని పిలుస్తుంటారు. మొదట్లో సుమారు 26 లక్షల ఎకరాల వరకు పార్ట్-బిలో ఉండేవని, ఇందులో 8 లక్షల ఎకరాలను కేసీఆర్ ప్రభుత్వం పరిష్కరించిందని చెప్పారు. మిగిలిన 18 లక్షల ఎకరాల్లో, దరఖాస్తుల పరిష్కారానికి కేసీఆర్ మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వం దరఖాస్తు ధర క్యాబినెట్ సబ్ కమిటీ నియమించింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం పార్ట్-బిలోని భూముల సమస్యల పరిష్కారానికి వివిధ దశల్లో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.అత్యధిక శాతం తుది దశ అనుమతుల వద్దే నిలిచిపోయిన సమాచారం. ప్రభుత్వం తలచుకుంటే గత నాలుగు నెలల్లో పార్ట్-బిలోని లక్షలాది ఎకరాలకు మోక్షం కల్పించాలని అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ అయితే దాదాపు 10 లక్షల ఖాతాలకు లబ్ధి చేకూరుతుందని అంచనా. అదే జరిగితే రైతుబీమా, రైతు భరోసా వంటి పథకాలపై అధిక భారం పడుతుందని, కొన్ని నెలలు పక్కన పెట్టాలని సూచించినట్లు తెలిసింది.

# నన్ను కిందపడేయాలని చూస్తున్నారు

హైదరాబాద్,కొడంగల్‌లో తనని కింద పడేయాలని కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని.. 75 ఏళ్లలో కొడంగల్‌కు ఎవరూ చేయని అభివృద్ధి చేశానన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కొడంగల్ పర్యటనలో ఉన్న ఆయన సోమవారం సాయంత్రం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కొడంగల్‌కు తాను మెడికల్ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్, వెటర్నరీ కాలేజ్ తీసుకొచ్చానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కరువు ప్రాంతంగా ఉన్న కొడంగల్ ప్రాంతాన్ని 4 వేల కోట్ల రూపాయలతో నారాయణపేట్- కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టును తీసుకొచ్చానని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చారా అని బీజేపీ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను సీఎం ప్రశ్నించారు. కొడంగల్ ను అభివృద్ధి చేయనీయొద్దని డీకే అరుణ కుట్ర చేస్తున్నారన్నారు."అసలు కాంగ్రెస్ పార్టీని ఎందుకు ఓడించాలి. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకా? రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇచ్చినందుకా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా? ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా?" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.పదేండ్లల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం కొడంగల్ లో ఏ ఒక్కరికైనా డబుల్ బెడ్రూం ఇచ్చిందా అని సీఎం ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని స్పష్టం చేశారు.ఓట్ల కోసం మతాల మధ్య గొడవలు పెట్టాలని కొందరు ప్రయత్నిస్తున్నారని.. పదేండ్లు ప్రధానిగా ఉన్న మోదీ ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. పదేండ్లు ప్రధానిగా ఉన్న మోదీ మళ్లీ ఓటేస్తే చంద్రమండలానికి రాజవుతారా అని మండిపడ్డారు."మనల్ని దెబ్బ తీయడానికి పన్నాగాలు పన్నుతున్నారు. ఇది రేవంత్ రెడ్డిని దెబ్బతీయడం కాదు.. కొడంగల్ అభివృద్ధిని దెబ్బతీయడం. నేను ఎక్కడున్నా నా గుండె చప్పుడు కొడంగల్ మాత్రమే. కొడంగల్‌ను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం. నాతో కొట్లాడే హక్కు మీకుంది. పట్టు పట్టి పని చేయించుకునే అధికారం మీకుంది. రాష్ట్రానికే నాయకత్వం వహించే అవకాశం మనకు సోనియమ్మ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కొడంగల్ నుంచి 50వేల మెజారిటీ అందించాలి. కొడంగల్ పై జరిగే కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలి." అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌ను 14 సీట్లలో గెలిపించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అందుకు తగ్గట్టుగానే వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో పార్టీ నేతలకు, శ్రేణులకు కీలక సూచనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీటుపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్ మహబూబ్‌నగర్ పరిధిలోనే ఉండటంతో.. కొడంగల్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ తీసుకురావడంపై దృష్టి సారించారు. సోమవారం (ఏప్రిల్ 8) మండలాలవారీగా కాంగ్రెస్ నేతలతో సమీక్ష నిర్వహిస్తున్నారు. నేతలకు, కార్యకర్తలకు ఎన్నికల్లో అనుచరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. కాంగ్రెస్ తరపున మాజీ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి ఎంపీగా పోటీ చేస్తున్నారు. ఇక బీజేపీ తరపున మాజీమంత్రి డీకే అరుణ బరిలో ఉన్నారు. కచ్చితంగా ఈసారి ఎంపీగా గెలవాలని భావిస్తున్న డీకే అరుణ.. ఇందుకోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ తరపున సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాసరెడ్డి మరోసారి ఆ పార్టీ తరపున పోటీ చేస్తున్నారు. మూడు పార్టీలకు మహబూబ్‌నగర్‌లో పట్టు ఉండటంతో.. ఇక్కడ త్రిముఖ పోటీ ఉండొచ్చనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కాంగ్రెస్ భారీ మెజార్టీ సాధించడంపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి పెట్టారు.

# పక్షులు అంతరించిపోతున్నాయి

న్యూఢిల్లీ, వాతావరణ మార్పుల హెచ్చరికలను ప్రపంచం గుర్తించింది. 2070 నాటికి 'జీరో ఎమిషన్స్' సాధించాలనే భారత్ అంతర్జాతీయ నిబద్ధతకు మద్దతు లభించింది. ఇదిలా ఉండగా.. వాతావరణం, జీవావరణం మధ్య సమతుల్యతను పాటించాలని సుప్రీంకోర్టు మొదటిసారిగా ఆదేశాలు ఇచ్చింది. బొగ్గు, గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి మారడం, దాదాపు అంతరించిపోయిన గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షిని రక్షించడం వంటి వాటిని ప్రస్తావిస్తూ సుప్రీంకోర్టు సమతుల్యతను పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షిని గోదావన్ అని కూడా పిలుస్తారు, ఇది రాజస్థాన్‌లో కనిపిస్తుంది. 2019 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయమూర్తులు రద్దు చేశారు. ఆ ఉత్తర్వు.. రాజస్థాన్, గుజరాత్‌లలో 90,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విద్యుత్ ప్రసార మార్గాలను నిషేధించింది. సౌర విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తుంది. 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 450 గిగావాట్లకు పెంచాలనే భారతదేశ లక్ష్యాన్ని ప్రమాదంలో పడేస్తుంది. ఇప్పుడు గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షి యొక్క 13,000 చదరపు కిలోమీటర్ల కోర్ ఆవాసాన్ని మినహాయించి, 77,000 చదరపు కిలోమీటర్లలో విద్యుత్ ప్రసార మార్గాలపై నిషేధాన్ని సుప్రీం కోర్టు ఎత్తివేసింది. ఈ కేసు నిర్ణయాన్ని ఆదివారం అప్‌లోడ్ చేసింది. దీని ప్రకారం,పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని పెంచడం, పక్షులను రక్షించడం మధ్య సమతుల్యతను సాధించడంపై దృష్టి కేంద్రీకరించబడింది. విద్యుత్ తీగలు ఢీకొని చాలా పక్షులు చనిపోతాయని, అందుకే పర్యావరణవేత్త ఎం.కె. రంజిత్ సింగ్ వాదనల ఆధారంగా హై ఓల్టేజీ వైర్లపై నిషేధం విధించారు.ఈ అంశాన్ని క్షుణ్ణంగా విచారించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఏడుగురు సభ్యులతో కూడిన కొత్త నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తన నివేదికను జులై 31లోగా ప్రభుత్వం ద్వారా కోర్టుకు సమర్పించనుంది. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలను బెంచ్ అంగీకరిస్తూ.. 'పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలనే భారత్ నిబద్ధత, ముఖ్యంగా గుజరాత్, రాజస్థాన్ వంటి ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగానే ఉంది. ' ఈ ఆదేశాలు ఇచ్చింది.

## బదిలీ అయిన ఐఏఎస్ అధికారులకు పోస్టింగులు

అమరావతి,ఆంధ్రప్రదేశ్ లో మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలో.. పలువురు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసింది. గత వారం రోజుల క్రితం ఆరుగురు ఐపీఎస్ అధికారులు, ముగ్గురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. ఉత్తర్వులను ఈసీ జారీ చేసింది. ఈ క్రమంలో తాజాగా, ఏపీలో ట్రాన్స్‌ఫర్లు అయినా ఐఏఎస్ అధికారులకు పోస్టింగులను కేటాయిస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన సలహాదారు జవహర్ రెడ్డి జీవో జారీ చేశారు. కాగా, ఇటీవల ఈసీ వేటుతో బదిలీ అయిన ఐఏఎస్సులకు పోస్టింగులు ఇచ్చింది. వీరికి ఎన్నికలతో సంబంధం లేని శాఖలను ఏపీ ప్రభుత్వం కేటాయించింది. ఆరోగ్య శ్రీ ట్రస్టు సీఈఓగా లక్ష్మీషా.. స్కిల్ డెవలప్మెంట్

# ఎవరి పంచాంగం వారిదే...



హైదరాబాద్,ఉగాది పర్వదినం రోజున పంచాంగాల్లో పండితులంతా ఒకటే చెప్పరు. ఉగాధి వేడుకల్లో పాల్గొనడానికి వెళ్లినప్పుడు పండితులు ఆయా రాజకీయ పార్టీలకు అనుకూలంగా పంచాంగ శ్రవణం వినిపిస్తూంటారు. ఈ సారి కూడా అదే పరిస్థితి కనిపించింది. తెలంగాణలోని ఏ పార్టీ ఆఫీసులో ఎలాంటి పంచాంగం చెప్పారో ఓ సారి చూద్దాం.

గాంధీభవన్ లో ..ప్రతిపక్షం బలహీనపడుతుంది

గాంధీభవన్ పంచాంగంలో పండితులు కొన్ని విషయాలను చెప్పారు. పండితులు ఏం చెప్పారంటే..”వచ్చే మూడు నెలల్లో భూ కంపాలు,అగ్ని ప్రమాదాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.. చైనా, పాకిస్థాన్‌ల మీద మనం పైచేయి సాదిస్తాము. పత్రికా రంగం అధిపతి ఒకరు చనిపోతారు.. క్రీడా రంగంలో ఒక ప్రముఖ క్రీడాకారుడు చనిపోతాడు. కేంద్ర ,రాష్ట్ర సిలబస్‌లో చాలా మార్పులు జరుగుతాయి. సిమెంట్, ఇటుక వాడుకలు తగ్గుతాయి.. ప్రతిపక్షం చాలా బలహీన పడుతుంది.. విదేశీ మత్తు పదార్థాలను అరికట్టడం చాలా కష్టం అవుతుంది.

పాన్ ఇండియా మూవీలన్నీ ఫ్లాప్ అవుతాయి

ప్యాన్ ఇండియా సినిమాలు తీసే నిర్మాతలు చాలా నష్టపోతారు. ఆర్థిక పరమైన సినిమాలు ఎక్కువగా వస్తాయి. సినిమా, రాజకీయ ప్రముఖులలో కొందరు చనిపోతారు.. సినీ రంగంలో భార్య భర్తల మధ్య విడాకుల సంఖ్య ఎక్కువ అవుతాయి. కరోనా సమసి పోలేదు.

స్కామ్ లో నేతలు జైలుకు వెళతారు

కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో ఉన్న రాజకీయ నాయకుల అక్రమ సంబంధాలు బయట పడుతాయి.. తెలుగు రాష్ట్రాలలో గత ప్రభుత్వంలో చేసిన భూ స్కాంలు, అవినీతి బయట పడుతుంది..స్కాంలలో కొందరు నాయకులు అరెస్ట్ అవుతారు. దేవాలయాల అభివృద్ధి జరుగుతుంది. దేశ రాజకీయాల్లో చాలా మార్పు లు జరుగుతాయి.

రేవంత్ రెడ్డికి ఈ ఏడాది అనుకూలం

కొంత మంది ప్రముఖ నేతలు కనుమరుగువుతారు.. 2027 నుంచి 2030 వరకు మన దేశం అగ్ర స్థానంలో ఉంటుంది.. ఒక యోగి మన దేశాన్ని పాలిస్తాడు.. వెండి, బంగారం,ఇత్తడి ధరలు మరింత పెరుగుతాయి. వచ్చే సంవత్సరం వరకు రేవంత్ రెడ్డికి జాతకం బాగుంది. వచ్చే సంవత్సరం వరకు ఆయనను ఎవరు ఏమి చేయలేరు.. రాహుల్ గాంధీ కొన్ని అనూహ్య స్థానాలు గెలుచుకుంటారు.” అని గాంధీభవన్ పంచాంగంలో తెలిపారు.

బీజేపీ కార్యాలయంలో

బీజేపీ నిర్వహించిన ఉగాది వేడుకల్లో కప్పగంతు సూర్యనారాయణ మూర్తి పంచాంగ శ్రవణం వినిపించారు. బీజేపీ పంచాంగ శ్రవణంలో పండితులు ఏమన్నారంటే..”వర్షాలు కురుస్తాయి, పంటలకు అనుకూలంగా వర్షాలు సకాలంలో కురుస్తాయి. ధరలు తగ్గుతాయి, కొనుగోలు శక్తి పెరుగుతుంది వ్యాపార వర్గంలో ఉండే వారికి నష్టం కలుగుతుంది. మే, జూన్, జులైలో ముహూర్తాలు లేవు. ఆగస్టు 7 నుండి ముహూర్తాలు. ఈ ఏడాది ఆదాయం కన్నా వ్యయం ఎక్కువ. దేశీయ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా ప్రాధాన్యత. ఉత్తర ఈశాన్య భారతంలో భూమిలో కదలికలు%ౌ% ప్రాణ నష్టం ఉండదు. వ్యక్తిగత వైరాలు పెరిగిన సఖ్యత వస్తుంది. సుస్థిర ప్రభుత్వం వస్తుంది.” అని తెలిపారు.

తెలంగాణ భవన్ పంచాంగ శ్రవణం

“క్రోధి నామా సంవత్సరంలో రైతులకు శుభం కలుగుతుంది. ఉత్పత్తి ధరలు ఆకాశానికి అంటే అవకాశం ఉంది. ఉత్తరాఖండ్‌లో కొండ చర్యలు విరిగిపడే ప్రమాదం ఉంది. ప్రపంచం అంతా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురైతాయి. దేశ సరిహద్దుల్లో పరస్పరం నైశ్యర్యం కలిగే ప్రమాదం ఉంది. దేశ సరిహద్దులోనే కాదు ప్రజల మధ్య పరస్పర మత విద్వేషాలు పెరుగుతాయి. పాలక పక్షంకు ఈ సారి కష్టకాలం ఉంది. ప్రతి పక్షానికి దిగ్విజయం ఉంది.

కెసిఆర్ కు వాహన ప్రమాదం ఉంది..

ఇటీవల భారతదేశంలో గ్రహణాలు కనిపించడం లేదు కనిపిస్తున్నాయి అని భ్రమపడుతున్నాము. క్రోది నామ సంవత్సరంలో చంద్ర గ్రహణం,సూర్య గ్రహణం కనిపించవు. కేసీఆర్ రాశి (కర్కాటకం) అత్యంత సంతోషకరంగా ఆదాయ, వ్యయాలు కనిపిస్తున్నాయి. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. వారి మాటకు, గమనానికి అడ్డులేని సంవత్సరంగా కనిపిస్తోంది. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. వాహన ప్రమాద సూచన ఉంది కాబట్టి ఎక్కువ ప్రయాణాలు చేయొద్దు. కేసీఆర్ దోష నివారణ కోసం లక్ష్మీ మోహన గణపతిని చవితి నాడు దర్శనం చేసుకోవాలి.” అని తెలంగాణ భవన్‌లో పండితులు పేర్కొన్నారు.

# కలిసే కదనం జగన్ ప్రభుత్వాన్ని మార్చాలి

అమరావతి,జనసేన పార్టీని బలోపేతం చేసి మెజార్టీ స్థానాలను సొంతం చేసుకుని ముఖ్యమంత్రి కావాలన్నది ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయం..లక్ష్యం. వీటన్నింటి కంటే ముందు రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని అడ్డుకోవ డంతో పాటు రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రాకుండా ఉండాలన్నది పవన్ ముఖ్య ఉద్దేశ్యం.. ఈ నేపథ్యంలోనే ఆయన ప్రస్తుత ఎన్నికల్లో తెలుగుదేశంతో కలిసి వైసీపీని ఓడించేందుకు కూటమిగా ముందుకు సాగుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీల మిత్రపక్షాలుగా పోటీ చేస్తున్న ఈ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు నేపథ్యంలో ఆ పార్టీకి 21 ఎమ్మెల్యే సీట్లు, 2 లోక్‌సభ స్థానాలను కూటమికేటాయించింది. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో సీట్లు ఆశించిన జనసేన నేతల్లో కొంత అసహనం, అసంతృప్తి, ఆందోళన స్పష్టంగా కనిపిస్తుంది. ఆయా జిల్లాల్లో జనసైనికుల్లో కూడా తమ నేతలకు టికెట్ రాలేదన్న ఆవేదన బలంగా వినిపిస్తోంది..కనిపిస్తోంది. దీంతో ఇటీవల ముఖ్య నేతలతో సమావేశమైన పవన్ కంగారొద్దు..! ఎవరూ అధైర్య పడవద్దు.. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు మనకు సెమీ ఫైనల్స్ మాత్రమే.. 2029 ఎన్నికల్లో మనమే ఫైనల్ ఆడుదాం.. అప్పటివరకు అందరూ ఓర్పు, సహనంతో ఉండాలని సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయడంతో పాటు జనసేన నుంచి పోటీ చేస్తున్న 21 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు, 2 లోక్‌సభ స్థానాల నుంచి బరిలో ఉన్న ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ క్యాడర్‌కు ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు. కూటమి నుంచి బరిలో ఉన్న ప్రతి అభ్యర్థిని గెలిపించుకోవడం తమ బాధ్యతగా ప్రతిఒక్కరు ముందుకు సాగాలని పవన్ కళ్యాణ్ స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది.

మనమే కీలకం

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని మార్చేయాలి.. 2019 ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేయడం వల్ల వైసీపీకి కలిసొచ్చింది. జనసేన అభ్యర్థులు ఓట్లు చీల్చడం ద్వారా తెలుగుదేశానికి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఇటు వంటి పరిస్థితులు పునరావృతం కాకుండా మరోసారి జగన్ కు అధికారం అందకుండా చేయాలి. అందుకోసం అందరం కలిసికట్టుగా పోరాడుదామని పవన్ జనసైనికులకు పదే పదే చెబుతూ వస్తున్నారు. రాష్ట్రంలో అధికారం మారాలి.. మనమే కింగ్ మేకర్ కావాలి. ఆ దిశగా ప్రస్తుత ఎన్నికలను ప్రతిఒక్కరు ఓ సవాల్‌గా తీసుకుని పనిచేయాలని సూచిస్తు న్నారు. కూటమి గెలుపొందితే ఖచ్చితంగా రాష్ట్రంలో మనమే కింగ్ మేకర్ అవుతాం..ఈ విషయంలో ఎవరికీ ఎటువంటి అనుమానాలు, సందేహాలు అవసరం లేదు. ఖచ్చితంగా ఉప ముఖ్య మంత్రిగా తమకు అవకాశం వస్తుం దని, ఇదే సందర్భంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ తాము ప్రధాన భాగస్వా ములుగా ఉండబోతున్నాం.. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు అంతా ఐక్యంగా



అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయా లని పవన్ పార్టీ శ్రేణులకు సూచిస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లోపు..పార్టీ నిర్మాణం, విస్తరణ

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యంగా నేతలంతా తమ శక్తి మేరకు కృషి చేయాలి. కూటమి విజయం సాధిస్తే రానున్న ఐదేళ్లలో జనసేన మరింత బలపడడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టంగా చేపట్టడంతో పాటు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జనసేనను విస్తరింప చేసుకునేందుకు మంచి అవకాశం లభిస్తుందన్న యోచనలో పవన్ ఉన్నట్లు చెబుతున్నారు. పార్టీ శ్రేణులకు కూడా ఆయన ఇదే అంశాన్ని పదే పదే చెబుతున్నట్లు తెలుస్తోంది. 2029 ఎన్నికల్లో అభిమానుల కోరిక కూడా నూటికి నూరు శాతం నెరవేరు తుందన్న విశ్వాసాన్ని కూడా పవన్ పార్టీ క్యాడర్‌లో బలంగా కల్పిస్తున్నారు. రాష్ట్రంలో జనసేన బలోపేతం కావాలంటే ప్రస్తుత ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య ఓట్ల బదిలీ ఖచ్చితం గా జరిగి తీరాలని, ఈ అంశాన్ని ప్రతిఒక్కరు సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని ఆయన చెబుతున్నారు. తనపై నమ్మకాన్ని ఉంచి పార్టీ భవిష్యత్తు, క్యాడర్ భవిష్యత్తు తనకు వదిలేసి ప్రస్తుత ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కష్టపడి పనిచే యాలని సూచిస్తున్నారు. గ్రూపు తగాదాలు, వివాదాలు పక్కన పెట్టి తెలుగుదేశం, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుని బలంగా ముందుకు సాగాలని చెబుతున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో జనసేన నుంచి టికెట్లు ఆశించి రానివారు నమ్మకంతో ఉంటే వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకోవ డంతో పాటు ఎన్నికల ఫలితాల అనంతరం వారికి తగిన ప్రాధాన్యతను కల్పిస్తానని ఆయా జిల్లాలకు చెందిన నేతలకు ఆయన భరోసా ఇస్తున్నారు. ఆ దిశగా పవన్ ప్రతి అంశాన్ని ఓ సవాల్‌గా తీసుకుని ప్రస్తుత ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యంగా వచ్చే ఎన్నికల్లో జనసేన ఫైనల్ ఆడి తీరుతుందన్న నమ్మకం, పట్టుదలను జన సైనికుల్లో ఇప్పటి నుంచే కల్పించేలా ఆయన దూకుడుగా సార్వత్రిక ఎన్నికల్లో దూసుకుపోతున్నారు.

# జనసేన పార్టీకి షాక్.. వైసీపీలో చేరిన పోతిన మహేష్



అమరావతి : ఏపీ(ఆంధ్రప్రదేశ్) ఎన్నికల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీల్లో సీట్ల కేటాయింపు కొత్త కూటమికి కారణమవుతోంది. సీట్లు దక్కని అసంతృప్త నేతలు పార్టీ వీడుతున్నారు. తాజాగా జనసేన(జనసేన) నేత పోతిన మహేష్(పోతిన మహేష్), మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరి, రమేశ్‌రెడ్డి సీఎం జగన్ సమక్షంలో బుధవారం వైసీపీలో(వైసీపీ) చేరారు.వీరికి సీఎం జగన్ పార్టీ జెండా కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాగా, విజయవాడ వెస్ట్ ఆశించి భంగపడ్డ మహేష్ రెండు రోజుల క్రితం జనసేన పార్టీకి గుడ్ చెప్పారు. ఈ సందర్భంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. తాను పార్టీ కోసం కష్టపడినా గుర్తింపు దక్కలేదని పోతిన మనస్తాపానికి గురై రాజీనామా చేసారు.విజయవాడ పశ్చిమ నియోజకవర్గం సీటు కోసం మహేష్ చివరి వరకు ప్రయత్నించారు. కానీ, పొత్తులో భాగంగా సీటు బీజేపీకి దక్కింది. అక్కడ నుంచి కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి పోటీ చేస్తున్నారు. దీంతో మహేష్ తన అనుచరులతో కలిసి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు.

# మహారాష్ట్ర : 'మహా'లో కుదిరిన సీట్ల సర్దుబాటు

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో ఇండియా వేదికలో ప్రధాన భాగస్వామ్యపార్టీలుగా ఉన్న శివసేన, కాంగ్రెస్, ఎన్‌సిపి మధ్య సీట్ల సర్దుబాటు కుదిరింది. మొత్తం 48 లోక్‌సభ స్థానాలకు గాను మాజీ ముఖ్యమంత్రి ఉద్దవ్ ఠాక్రేకు చెందిన శివసేన పార్టీ – 21,కాంగ్రెస్–17, శరద్ పవర్ సారథ్యంలోని నేషలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) 10 సీట్లలో పోటీ చేసేందుకు ఈ మూడు పార్టీల మధ్య అంగీకారం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సాంగ్లీలో శివసేన (ఠాక్రే) పోటీ తిరిగి పోటీ చేస్తుంది. భివాండిలో ఎన్‌సిపి నిలబడుతుంది. ముంబాయి ఉత్తర లోక్‌సభ స్థానం కాంగ్రెస్‌కు కేటాయించారు.

ఈ సందర్భంగా శివసేన నేత ఉద్దవ్ ఠాక్రే మాట్లాడుతూ, బిజెపిని ఓడించడమే ఇండియా బ్లాక్ లక్ష్యమని అన్నారు. మోడీ తమ పార్టీని 'నకిలీ శివసేన'గా చూపిస్తున్నారని, దోపిడీ దొంగల పార్టీ తమను ఫేక్ అనడం నవ్వుతెప్పిస్తోందన్నారు. బిజెపి 'దోపిడీదారుల పార్టీ' అని ఎలక్టోరల్ బాండ్ల 'స్కామ్'తో మరింత స్పష్టమైందని ఠాక్రే అన్నారు. . బిజెపిని ఓడించాలనే లక్ష్యాన్ని సాధించడానికి 'విశాల దృక్పథంతో' ఉండాలని నిర్ణయించుకున్నట్లు కాంగ్రెస్ నేత నానా పటోలే చెప్పారు. ఠాక్రే, శరద్ పవార్ పార్టీలను తిరుగుబాటుదారులు హైజాక్ చేశారు.ముంబైలో సర్దుబాటు ఒప్పందంలో ముంబై భాగంగా జల్గావ్, పర్భానీ, నాసిక్, పాల్‌ఘడ్, కళ్యాణ్, థానే, రారుగ్, మావల్, ఉస్మానాబాద్, సెంట్రల్, రత్న గిరి–సింధు దుర్గ్, బుల్దానా, హత్కనంగ్‌కలే, ఔరంగాబాద్,




షిర్డీ, సాంగ్లీ, హింగోలి, సౌత్‌వాత్– ముంబై నార్త్ వెస్ట్, ముంబై నార్త్ ఈస్ట్ సీట్లను శివసేన (ఠాక్రే)కు కేటాయించారు. కాంగ్రెస్ నందుర్‌బార్, ధులే, అకోలా, అమరావతి, నాగ్‌పూర్, భండారా–గోండియా, గడ్చిరోలి–చిమూర్, చంద్రాపూర్, నాందేడ్, జాల్నా, ముంబై నార్త్ సెంట్రల్, ముంబై నార్త్, పూణే, లాతూర్, షోలాపూర్, కొల్హాపూర్‌లో పోటీ చేస్తుంది. సతారా, భివాండి, దిండోరి, మాధా, రావర్, వర్ధన్, అహ్మద్‌నగర్ సౌత్, బీడ్ స్థానాల్లో ఎన్‌సిపి(శరద్ పవర్) పోటీ చేయనున్నారు. మహారాష్ట్రలో 48 లోక్‌సభ స్థానాలకు ఈ నెల 19 నుంచి మే 20 వరకు ఎన్నికలు జరగనున్నాయి.

# లిక్కర్ స్కామ్ తో సంబంధం లేదు..ఈడీ కోర్టు న్యాయమూర్తికి కవిత లేఖ



న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. తనకు ఎలాంటి ఆర్థికపరమైన లాభం చేకూరలేదని క్లారిటీ ఇచ్చారు. ఈ కేసులో తాను బాధితురాలినని.. లిక్కర్ కేసులో తనను బలిపశువును చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఈడీ కోర్టు న్యాయమూర్తికి నాలుగు పేజీలు లేఖ రాశారు.తాను తప్పు చేశాననడానికి ఈడీ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని.. రెండున్నరేళ్ల కేసు విచారణలో ఎలాంటి సాక్ష్యాలు లభించలేదన్నారు. ఈ కేసులో అరెస్ట్ అయిన ఇతర నిందితుల స్టేట్మెంట్‌తో తనను అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఈ కేసులో మీడియా ట్రైలర్ ఎక్కువ జరుగుతుందని.. సీబీఐ, ఈడీ ఇన్వెస్టిగేషన్ కన్నా మీడియా విచారణ ఎక్కువగా జరుగుతుందన్నారు.తన మొబైల్ నెంబర్‌ను అన్ని ఛానల్‌లో వేసి నా ప్రైవసీకి భంగం కలిగించారని పేర్కొన్నారు. తన రాజకీయ పరపతిని దెబ్బతీసే విధంగా వివరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే నాలుగుసార్లు విచారణకు హాజరయ్యా.. తన బ్యాంకు వివరాలు కూడా ఇచ్చి విచారణకు సహకరించానని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలకు నా ఫోన్లను కూడా అందజేశానని.. కానీ వాటిని ధ్వంసం చేసినట్లు తనపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు.ఈడీ, సీబీఐ నమోదు చేస్తోన్న 95 శాతం కేసులన్నీ విపక్ష నేతలకు సంబంధించినవేనని.. బీజేపీలో చేరిన వెంటనే ఆ కేసుల విచారణ ఆగిపోతుందన్నారు. పార్లమెంట్ సాక్షిగా విపక్ష నేతలను ఉద్దేశించి 'నోరు మూసుకోకపోతే ఈడీని పంపుతాం' అని బీజేపీ నేతలు అన్నారన గుర్తు చేశారు. లిక్కర్ స్కామ్ కేసు విచారణకు పూర్తిగా సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని.. తనకు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్నానని కవిత లేఖలో విజ్ఞప్తి చేశారు.

# కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు

ఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు. లిక్కర్ కుంభకోణంతో ముడిపడిన మనీ లాండరింగ్ కేసులో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. కేజ్రీవాల్ అరెస్టులో చట్ట నిబంధనల ఉల్లంఘన ఏమీ జరగలేదని కోర్టు స్పష్టం చేసింది.ప్రస్తుతం తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్ తన అరెస్టుతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కస్టడీకి అతనికి రిమాండ్ చేయడాన్ని కూడా సవాల్ చేశారు. ఇడి కస్టడీకి పంపడం అక్రమం ఏమీ కాదని కోర్టు అనుమతి. కేజ్రీవాల్ అరెస్టుకు కారణమైన 'తగినన్ని దాఖలాలు' ఇడి వద్ద ఉన్నాయని, సహేతుకమైన ఉత్తర్వు ద్వారా ఇడి కస్టడీకి ట్రయల్ కోర్టు ఆయనను రిమాండ్ చేసిందని హైకోర్టు న్యాయమూర్తి స్వర్ణకాంత శర్మ తెలియజేశారు. 'అర్వింద్ కేజ్రీవాల్ అరెస్టు చట్టాలకు విరుద్ధంగా జరగలేదని కోర్టు కోరుతోంది. రిమాండ్‌ను అక్రమంగా పరిగణించలేం' అని జస్టిస్ స్వరాణ కాంతశర్మ తీర్పు వెలువరిస్తూ చెప్పారు.ఆమె 25 నిమిషాల సేపు తీర్పు చదివారు. తన నిర్ణయానికి సంబంధించిన కొన్ని అంశాలు కూడా ఆమె హిందీలో వివరించా రు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ సిఎం హోదాలో ఉన్న కేజ్రీవాల్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించాలన్న ఆయన తరుపు లాయర్ విజ్ఞప్తిని న్యాయమూర్తి తోసిపుచ్చారు. సిఎంకు ఒక న్యాయం, సామాన్యుడికి ఒక న్యాయం ఉండదని స్పష్టం చేశారు. సిఎం అయినంత మాత్రాన ప్రత్యేక హ క్కులేమీ ఉండవని తెలియజేశారు. విచారణ ఎలా సాగాలో నిందితుడు చెప్పాల్సిన అవసరం లేదు. నిందితుడి వీలును బట్టి విచారణ సాగదని తెలియజేసారు. కేజ్రీవాల్ బెయిల్ అభ్యర్థనపై తాను విచారణ జరపడం లేదని, కానీ కొన్ని కారణాలపై అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తున్న ఆయన రిట్ పిటిషన్‌ను విచారిస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందని, కోర్టులు పట్టించుకునేది రాజ్యాంగపరమైన నైతికత గురించిన గాని, రాజకీయ నైతికత గురించి న్యాయస్థానం కోరింది.తమ పార్టీ లోక్ సభ ఎన్నికల ప్రచారానికి అవరోధం సృష్టించడానికే తనను అరెస్టు చేశారని, ఆయన పార్టీ ఆప్ ఆరోపించడాన్ని దృష్టిలో పెట్టుకుని కోర్టు ఈ వ్యాఖ్య చేసింది. 'రాజకీయ భావనలు, సమీకరణలను న్యాయస్థానం ముందుకు తీసుకురావడం, న్యాయ విచారణలకు సంబంధించినవి కావని ఈ కోర్టు అభిప్రాయపడింది. ఈ కోర్టు ముందు ఉన్న కేంద్ర ప్రభుత్వం, పిటిషనర్ కేజ్రీవాల్ మధ్య సంఘర్షణ కాదని ఈ కేసులో స్పష్టం చేయడం ప్రధానం. ఇది కేజ్రీ, ఎన్‌ఫోర్స్ డైరెక్టరేట్ మధ్య కేసు' అని శర్మ వివరించారు. ఈ దశలో తాము మినీ విచారణ నిర్వహించడం కనుక ఆప్ జాతీయ కన్వీనర్‌కు వ్యతిరేకంగా అప్రూవర్ల ప్రకటనలపై విచారణ సమయంలో తేల్చగలమని కోర్టు వెల్లడించింది. విచారణ దశలో అప్రూవర్లను క్రాస్ పరీక్ష చేసే స్వేచ్ఛ కేజ్రీవాల్‌కు ఉందని కోర్టు ఉంది. 2021–22 సంవత్సరానికి ఢిల్లీ ప్రభుత్వ ఎక్సైజ్ విధానం రూపకల్పన, అమలులో అవినీతి, మనీ లాండరింగ్ జరిగిన ఆరోపణకు సంబంధించినది.ఆరోపణలు వెలువెత్తడంతో ఢిల్లీ ప్రభుత్వం ఆ తరువాత రద్దు చేసింది. ఫెడరల్ మనీ లాండరింగ్ నిరోధక సంస్థ నిర్బంధ చర్య తీసుకోకుండా కేజ్రీవాల్‌కు రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరించిన కొన్ని గంటల తరువాత ఆయనను మార్చి 21న ఇడి అరెస్టు చేసింది. ఇడి కస్టడీ గడువు ముగిసిన తరువాత విచారణ కోర్టులో ఆయనను ఈ నెల 1న హాజరుపరచినప్పుడు ఆయనను జ్యుడీషియల్ కోర్టుకు రిమాండ్ చేశారు. ఆప్ జాతీయ కన్వీనర్ తన అరెస్టు 'సమయాన్ని' హైకోర్టు ముందు ప్ర శ్నించారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు, సమానావకాశాల కల్పనతో సహా రాజ్యాంగం మౌలిక స్వరూపానికి విరుద్ధంగా



అది ఆయన వాదించారు. ఆయన అభ్యర్థనను ఇది వ్యతిరేకించింది. రానున్న ఎన్నికల కారణంగా అరెస్టు నుంచి 'రక్షణ' కేజ్రీవాల్ కోరుకోజాలరని, చట్టం ఆయనకు, 'ఆమ్ ఆద్మీ'కి సమానంగా వర్తిస్తుందని ఇది వాదించింది. ఇది ఇలా ఉండగా, కేజ్రీ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతోఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఆప్‌లు మంగళవారం వెల్లడించాయి.

ఐదు కోర్టు కీలక వ్యాఖ్యలు

నేరంలో ప్రమేయం

కేజ్రీవాల్ అటు ఢిల్లీ సిఎంగా, ఆప్ కన్వీనర్‌గా లిక్కర్ స్కామ్‌లో పాల్గొన్నాడు.. ఎక్సైజ్ పాలసీ రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు. , సిఆర్‌పిసిలోని 164వ సెక్షన్ కింద రికార్డు చేశారు. అందువల్ల అప్రూవర్ల స్టేట్‌మెంట్‌లపై అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదు. అప్రూవర్లకు సంబంధించిన చట్టం వందేళ్ల నుంచి అమలులో ఉన్నది. కేజ్రీవాల్ కోసం ఈ చట్టాన్ని తీసుకోలేదు.. కేజ్రీవాల్ అరెస్టుకు కావలసిన స్పష్టమైన ఆధారాలు ఇడి వద్ద ఉన్నాయి.

అరెస్టు సమయం...

ఎన్నికల వేళ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ఆయన ను, ఆయన పార్టీని రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికేనన్న వాదన సరైనది కాదు. ఆధారాలున్నప్పుడు సమయం ప్రధానం కానేకాదు.

ఎన్నికల బాండ్లు

అప్రూవర్లలో ఒకరు ఎన్నికల బాండ్ల రూపంలో బిజెపికి విరాళాలు అందించారు. మరొకరు... బిజెపి మిత్రపక్షంలో చేరారు అని ఆప్ చేసిన ఆరోపణలు కోర్టు విచారణలో లేవు. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎవరు టిక్కెట్లు ఇచ్చారు. ఎవరు ఎన్నికల బాం డ్లు కొనుగోలు చేశారన్నది కోర్టుకు అప్రస్తుతం.

## నిప్పులు కురిపిస్తున్న సూరీడు

హైదరాబాద్,లపై సూరీడు నిప్పులు కురిపిస్తున్నట్టే ఉంది తెలుగురాష్ట్రాల్లో పరిస్థితి. భగభగ మండుతున్న ఎండలు మాడు మంటెక్కిస్తున్నాయి. ఉదయం 9 గంటలకే సూరీడు నిప్పులు చిమ్ముతుండటంతో జనం అల్లాడుతున్నారు. చాలాచోట్ల 40 డిగ్రీల టెంపరేచర్లు దాటిపోతున్నాయి. మరోవైపు వేడిగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. బయటకు వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. ఉదయం ఎండ తీవ్రతతో వేర్వేరు పనులపై వెళ్లే వాళ్లంతా ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలు దాటితే ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. జాతీయ రహదారి సైతం వాహనాలు రాకపోకలు లేక ఖాళీగా కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. సాధారణంగా ఏప్రిల్‌లో 40 డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. కానీ ఇప్పుడు 40 డిగ్రీల టెంపరేచర్లు క్రాస్ అవుతున్నాయి. మే నెల అప్పుడే వచ్చేసిందా అన్నట్టుగా సూరీడు నిప్పులు చిమ్ముతున్నాడు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com